Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue) : 159 పేజీలు (Pages) : 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

బుధవారం, 31 - 12 - 2025

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

## దుశ్శాసనుడు వచ్చారు.. అమిత్‌షాపై విరుచుకు పడిన మమత



**కోల్‌కతా:** టీఎంసీ పాలనలో హింస, అవినీతి రాజ్యమేలాయని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలపై పశ్చిమ బెంగాల్ ముఖ్య మంత్రి మమతా బెనర్జీ తీవ్ర స్థాయిలో మండి పడ్డారు. 'దుశ్శాసనుడు బెంగాల్ వచ్చారు' అంటూ పరోక్షంగా అమిత్‌షాపై ప్రతి విమర్శలు గుప్పించారు. రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన భూమిని ఇవ్వకపోవడం వల్లే భారత్–బంగ్లాదేశ్ సరిహద్దుల్లో కేంద్రం కంచె వేయలేక పోయిందని అమిత్‌షా చేసిన ఆరోపణలను సైతం ఖండించారు. బీజేపీ నేతలను మహా భారతంలోని పాత్రలైన దుర్యోధన, దుశ్శాస నులతో మమతా బెనర్జీ పోల్చారు. 'బెంగాల్‌కు ఒక దుశ్శాసనుడు వచ్చారు. ఎన్నికలు దగ్గరపడే కొద్దీ దుశ్శాసన, దుర్యోధనులు కనిపిం చడం మొదలవుతుంది. సమాచార సేకరణ కోసం దుశ్శాసనుడు వచ్చారు. పెన్సింగ్ కోసం మమతా బెనర్జీ భూములివ్వలేదని ఇవాళ వాళ్లు చెబుతున్నారు. నేను భూములు ఇవ్వకపోతే ఏమి జరిగి ఉండేది? పేట్రాపోల్‌లో భూములు ఇచ్చింది ఎవరు? ఆండాల్‌లో భూములు ఎవరిచ్చారు?' అని మంగళవారంనాడిక్కడ జరిగిన బహిరంగ సభలో మమతాబెనర్జీ ప్రశ్నించారు. పధ్నాలుగేళ్ల క్రితం ప్రజలు భయంగుప్పిట్లో ఉన్నప్పుడు తాము బంకురలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టామని, నీటిసంక్షోభాన్ని అధిగమిం చేందుకు ఎంతో చేశామని చెప్పారు. ఇప్పుడు ఎన్నికలు దగ్గర పడుతుండటంతో ఎస్ఐ ఆర్ పేరుతో ప్రజలను వేధింపులకు గురిచేస్తున్నారని బీజేపీని తప్పుపట్టారు.

**అమిత్‌షా ఏమన్నారు?**

బెంగాల్ సరిహద్దుల వెంబడి చొరబాట్ల సమస్య కేవలం రాష్ట్ర సమస్య కాదని, జాతీయ భద్రతకు సంబంధించిన అంశమని అన్నారు. జాతి సంస్కృతి, భద్రతను పరిరక్షించాలంటే బెంగాల్ సరిహద్దులను సీల్ చేసే ప్రభుత్వాన్ని ప్రజలు ఎన్నుకోవాల్సి ఉంటుందని అన్నారు. ఆ పని టీఎంసీ వల్ల కాదని, బీజేపీతోనే సాధ్య మని చెప్పారు. సరిహద్దు కంచెకు బెంగాల్ ప్రభుత్వం భూమి ఇవ్వక పోవడం వల్లే తొలుత బెంగాల్‌లో చొరబాటుదార్ల ప్రవేశం జరిగిందని ఆరోపించారు. ఓటు బ్యాంకును విస్తరిం చుకునేందుకే బెంగాల్ డెమోగ్రఫీలో మార్పులను మమత కోరుకు న్నారని తప్పుపట్టారు. ఈసారి జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో మూడింట రెండు వంతుల మెజారిటీతో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందనే ధీమాను వ్యక్తం చేశారు.

## కొత్త జిల్లాల ఏర్పాటుపై ప్రభుత్వం తుది నోటిఫికేషన్




**అమరావతి, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రం లో కొత్త జిల్లాల ఏర్పాటుపై తుది నోటిఫికేషన్‌ను మంగళవారం విడుదల చేసింది. ఏపీలో కొత్తగా మార్కాపురం, పోలవరం జిల్లా లను ఏర్పాటు చేస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ అయ్యాయి. రంప చోడవరం కేంద్రంగా పోలవరం జిల్లా ఏర్పాటు చేసినట్లు, మార్కా పురం కేంద్రంగా మార్కాపురం జిల్లా ఏర్పాటు చేసినట్లు నోటిఫికేషన్‌లో పేర్కొంది. ఇక రాష్ట్రంలో 5 కొత్త రెవెన్యూ డివిజ న్లను కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపింది. దీనివల్ల రాష్ట్రంలోని రెవెన్యూ డివిజన్లు, మండలాల సరిహద్దుల్లో మార్పులు జరిగాయి. కొత్త జిల్లాల ఏర్పాటుతో ఏపీలో మొత్తం జిల్లాల సంఖ్య 28కి పెరిగింది. ఈ మార్పులు బుధవారం నుంచి అమల్లోకి రాను న్నాయి. మార్పుల్లో నందిగామ మండలాన్ని పలాస రెవెన్యూ డివిజన్ నుంచి టెక్కలి డివిజన్‌కు మార్చింది. సామర్లకోట మం డలాన్ని కాకినాడ డివిజన్ నుంచి పెద్దాపురం డివిజన్‌కు మారుస్తూ ఏపీ సర్కార్ కీలక మార్పులు చేసింది. అలాగే, పాడేరు కేంద్రంగా అల్లూరి సీతారామరాజు జిల్లా రీస్ట్రక్చర్ చేయడం, పెనుగొండను వాసవీ పెనుగొండుగా మార్చడం వంటి మార్పులు కూడా నోటిఫికే షన్‌లో కూటమి సర్కార్ చేర్చింది. అనకాపల్లి జిల్లాలో అడ్డరోడ్డు జంక్షన్‌తో రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటు చేయడం, అంబేద్కర్ కోనసీమ జిల్లాలో మండలాలను మార్చడం ద్వారా స్థానిక పరిపా లన మరింత సులభతరం అవుతుందని కూటమి ప్రభుత్వం భావిం చింది. ఈ మార్పుల ద్వారా జిల్లా పరి పాలన, రెవెన్యూ కార్యకలా పాలు మరింత సమర్థవంతంగా నిర్వహించడానికి అవకాశం ఉ ంటుందని ప్రభుత్వం అనుకుంటుంది. ఈ నిర్ణయం గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలకు సమగ్ర సేవలందించడానికి తీసుకు న్నట్లు ఏపీ ప్రభుత్వం స్పష్టం చేసింది. కొత్త జిల్లాల ఏర్పాటుతో పౌరసేవల చేరిక వేగవంతం అవుతుందని... రెవెన్యూ డివిజన్ల మార్పులు, చేర్పులు స్థానిక అధికారుల ప్రవర్తనను మరింత సమర్థవంతంగా చేస్తాయని భావిస్తోంది. తుది నోటిఫికేషన్ ప్రకారం, రేపటి నుంచి కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండ లాల సరిహద్దుల మార్పులు అధికారికంగా అమల్లోకి రాను న్నాయి. ప్రజలు, స్థానిక సంస్థలు, అధికారులు అన్ని విధాలుగా ఈ మార్పులకు అనుగుణంగా తమ కార్యక్రమాలను సర్దుబాటు చేసుకోవాల్సి ఉంది. ఈ కొత్త ఏర్పాట్లు ఏపీలో పరిపాలనలో మరింత సమర్థత, ప్రజల చేరికలో సౌలభ్యం, స్థానిక అభివృద్ధికి దోహదపడతాయని అభిప్రాయపడుతుంది. ఏపీలో కొత్త జిల్లాల ఏర్పాటుతో ప్రజలకు సమగ్ర సేవలు, వేగవంతమైన పరిపాలన, వనరుల సమర్థవంతమైన వినియోగం అందించగలిగే అవకాశాలు పెరుగుతాయని ఏపీ సర్కార్ అనుకుంటుంది.

## కోనసీమ అభివృద్ధిపై పవన్ కల్యాణ్ స్పెషల్ ఫోకస్.. అధికారులకు కీలక సూచనలు

**అంబేద్కర్ కోనసీమ జిల్లా, (రాజధాని వార్తలు):** కోనసీమ అభివృ ద్ధిపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా కేసనపల్లి తుఫాన్ సెం టర్‌లో శంకర్ గుప్తం ప్రధాన మురుగు కాలువకు సంబంధించిన ఎనిమిది కిలోమీటర్ల పొడవునా పూడికతీత పనులు, 14.5 కిలోమీటర్ల పొడవునా గట్ల పటిష్టత పనులకు వర్చువల్ విధా నంలో శంకుస్థాపన చేశారు. ఈ క్రమంలో అధికారులకు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు పవన్ కల్యాణ్. రాజోలు నియోజకవర్గ రైతులకు ఐదేళ్లుగా దుఃఖ:దాయనిగా మారిన శంకర్ గుప్తం మేజర్ డ్రైనేజ్ సమస్యను సుబ్రహ్మణ్య షష్ఠి రోజున గుర్తించామని తెలిపారు. కేవలం 34 రోజుల కాల వ్యవధిలో శాశ్వత పరిష్కారం దిశగా ముక్కోటి ఏకాదశిన పనులు ప్రారంభించామని వెల్లడించారు. ఈ పనులకు రూ.20.62 కోట్లు కేటాయించామని అన్నారు. శంకర్ గుప్తం ప్రధాన మురుగు కాల్వతో వరి, కొబ్బరి చెట్లను రైతులు కోల్పోయారని చెప్పుకొచ్చారు పవన్ కల్యాణ్. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఆర్థిక శాఖ మంత్రి పయ్యా వుల కేశవ్, ఆర్థిక శాఖ అధికారులతో సుదీర్ఘ చర్చలు జరిపినట్లు



వివరించారు. కేవలం 34 రోజుల్లోనే ఈ పనుల నిర్వాహణకు నిధులు కేటాయించామని చెప్పుకొచ్చారు. కొబ్బరి చెట్లకు నష్టం కలుగకుండా సంరక్షణ చర్యలు చేపడతామని అన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రూ.4 వేల కోట్లతో పంట కాలువలు, మురుగు కాలువలు ఆధునీకీకరిస్తామని తెలిపారు. కోనసీమ ప్రాంతంలో కోకో బోర్డు ఏర్పాటు చేయడానికి కేంద్ర ప్రభుత్వంతో సంప్రదిస్తామని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

## దేశంలోనే చంద్రబాబుది ప్రత్యేక స్థానం: ఎంపీ కేశినేని

**విజయవాడ, (రాజధాని వార్తలు):** సీఎం చంద్రబాబు నాయుడు చరిత్ర రాయాలంటే ఎన్ని పేజీలు అయినా సరిపోవని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. మంగళవారం నాడు ఆంధ్రప్రదేశ్ 15 ఏళ్ల ముఖ్యమంత్రిగా రికార్డు సృష్టించిన చంద్రబాబు పేరుతో బాయన శేఖర్ బాబు రాసిన పుస్తకాన్ని ఎంపీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎంగా చంద్రబాబు చేసిన సేవలను గుర్తు చేసేలా రాసిన పుస్తకాన్ని ఆవిష్కరించి నందుకు ఆనందంగా ఉందన్నారు. సీఎంగా 15 ఏళ్ల సుదీర్ఘ అనుభవం ఎంతోమందికి స్ఫూర్తిదాయకమన్నారు. అభివృద్ధి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యత ఇస్తూ దేశాన్ని ముందుకు తీసుకువెళ్లడంలో కూడా ఆయన పాత్ర కీలకమని చెప్పుకొచ్చారు. ఉమ్మడి ఏపీ, విభజన ఏపీ అబివృద్ధిలో చంద్రబాబు ప్రస్తావన లేకుండా చరిత్ర లేదన్నారు. ఎంత కోపం ఉన్నా.. ఎంత పని ఒత్తిడి ఉన్నా.. ముఖంలో కనిపించకుండా పని చేసే ఏకైక నేత చంద్రబాబు అని కొనియాడారు. చంద్రబాబు జీవితమే పెద్ద చరిత్ర అని.. దేశంలోనే ఆయనది ప్రత్యేక స్థానమని చెప్పుకొ చ్చారు. దేశంలో నదుల అనుసంధానం చేయాలని అనేక మంది ప్రధానులు కలలుగంటున్నారని.. చంద్రబాబు రాష్ట్ర ముఖ్యమం త్రిగా కృష్ణా, గోదావరి నదులను అనుసంధానం చేసి చూపిం



చారని తెలిపారు. చంద్రబాబు ప్రవేశ పెట్టిన అనేక పథకాలు నేడు కేంద్ర ప్రభుత్వం ఆదర్శంగా తీసుకుని దేశం మొత్తం కూడా అమలు చేస్తోందన్నారు. రాష్ట్రం అబివృద్ధి చెందాలన్నా, సంక్షేమం ముందుకు వెళ్లాలన్నా చంద్రబాబు వల్లే సాధ్యమని వెల్లడించారు. రాష్ట్ర విభజన వల్ల నష్టపోయిన ఏపీని అన్ని విధాలా గాడిలో పెట్టిన దార్శనికుడు చంద్రబాబు అని అన్నారు. ఆయన బాటలో ఆయనతో కలిసి తామంతా పని చేస్తున్నామని తెలిపారు. చంద్ర బాబు గురించి అందరూ తెలుసుకునేలా పుస్తకం రాసిన శేఖర్ బాబుకు ఎంపీ కేశినేని శివనాథ్ ధన్యవాదాలు తెలియజేశారు.

## సచివాలయ సంఘ ఎన్నికల్లో రామకృష్ణ విజయదుందుభి

### - అధ్యక్షుడిగా భారీ మెజార్టీతో గెలుపు
### - 9 పదవుల్లో ఆయన ప్యానెల్కే 7



**అమరావతి, (రాజధాని వార్తలు):** రాష్ట్ర సచివాలయ సంఘం (అప్సా) అధ్యక్షుడిగా గొలిమి రామకృష్ణ విజయదుందుభి మోగించారు. ఆయన తన సమీప ప్రత్యర్థి కోట్ల రాజేష్‌పై 206 ఓట్ల మెజా రిటీతో విజయం సాధించారు. అమరావతి సచివాలయంలో సోమవారం జరిగిన ఎన్నికల్లో ఆయన ప్యానెల్కు ఉద్యోగుల నుంచి విశేష మద్దతు లభించింది. ఓట్ల లెక్కింపు అర్ధరాత్రి 1.30 వరకు కొనసాగింది. ఫలితాలు వెల్లడి కాగానే సచివాలయ ప్రాంగణంలో ఉద్యోగులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. అప్సా ఎన్నికల్లో మొత్తం 1150 మంది ఉద్యోగులు ఓటర్లుగా ఉండగా.. 1,105 ఓట్లు పోలయ్యాయి. కార్యవర్గంలో మొత్తం 9 పదవులకు పోటీ జరగగా, ఏడింట రామకృష్ణ ప్యానెల్ విజయదుందుభి మోగించింది. అధ్యక్ష స్థానానికి రామకృష్ణ ప్యానెల్ నుంచి రామ కృష్ణ, కోట్ల రాజేశ్ ప్యానెల్ నుంచి రాజేశ్ తలపడ్డారు. ట్రెజరర్ రామకృష్ణ ప్యానెల్కు చెందిన సోమవారం సచివాలయంలో భాగ్య లక్ష్మి తన ప్రత్యర్థిపై జగదీశ కుమార్‌పై గెలుపొందారు. ఉ పాధ్యక్షుడిగా పవన్ కుమార్ తన ప్రత్యర్థి గోపీ కృష్ణపై 398 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఉపాధ్యక్ష (మహిళ) స్థానంలో లక్ష్మణకుమారి తన ప్రత్యర్థి కవితపై 20 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. జాయింట్ సెక్రటరీ (స్పోర్ట్స్)గా మధుబాబు తన ప్రత్యర్థి సత్యనారాయణపై 333 ఓట్ల మెజారిటీతో గెలిచారు. జాయింట్ సెక్రట రీ(ఆర్గనైజేషన్)గా రాజేంద్ర ప్రకాశ్ తన ప్రత్యర్థిపై అప్సా ఎన్నికల ఓట్ల లెక్కింపు సందడి నాగూర్ మీరావ లిపై 110 ఓట్ల ఆధిక్యంతో ఇంకో జాయింట్ సెక్రటరీ (మహిళ) గా సునీత తన ప్రత్యర్థి సాయిలీలపై 53 ఓట్ల మెజారిటీతో గెలు పొందారు. మొత్తం ఫలితాల్లో రామకృష్ణ ప్యానెల్ 7 పదవుల్లో విజయం సాధించింది. ప్రధాన కార్యద ర్శిగా రాజేశ్ ప్యానెల్కు చెందిన నాతా ప్రసాద్ ఆరు ఓట్ల స్వల్ప మెజారిటీతో గెలుపొం దారు. అదనపు కార్యదర్శిగా ఇదే ప్యానెల్కు చెందిన లింగారెడ్డి 183 ఓట్ల ఆధిక్యంతో గెలిచారు.

## న్యూఇయర్.. హద్దు దాటితే కఠిన చర్యలు



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** నూతన సంవత్సర వేడుకలను శాంతియుతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు విశాఖపట్నం నగర పోలీస్ కమిషనరేట్ పలు కఠిన ఆంక్షలను విధించింది. డిసెంబర్ 31వ తేదీ రాత్రి వేడుకల నిర్వహణకు అనుమతులు ఇచ్చినప్పటికీ, రాత్రి 12 గంటల వరకు మాత్రమే కార్యక్రమాలకు అనుమతి ఉంటుందని విశాఖపట్నం సీపీ శంఖబ్రత బాగ్చి స్పష్టం చేశారు. ఈ నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. హోటళ్లు, రెస్టారెంట్లు, క్లబ్బుల్లో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించే నిర్వాహకులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చట్ట విరుద్ధమైన కార్యక్రమాలు, అసాంఘిక చర్యలు, అశ్లీల నృత్యాలు నిర్వహిస్తే నిర్వాహకులతో పాటు పాల్గొన్న వారిపై కూడా కేసులు నమోదు చేస్తామని తెలిపారు. నగరంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ఏ చర్యనైనా సహించబోమని స్పష్టం చేశారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా నగరమంతా భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. సుమారు 500 మంది పోలీస్ సిబ్బందితో డ్రంకెట్కన్‌డ్రైవ్ పరీక్షలు, ట్రిపుల్ రైడింగ్‌పై ప్రత్యేకంగా గస్తీ నిర్వహిస్తామని వెల్లడించారు. అతిగా మద్యం సేవించి వాహనం నడిపితే సీజ్ చేయడంతో పాటు చట్టపర మైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బైక్ సైలెన్సర్లతో హడావుడి చేస్తూ ప్రజలను ఇబ్బంది పెట్టే వారిని వెంటనే అరెస్టు చేస్తామని తెలిపారు. అలాగే ఈ వేడుకల నేపథ్యంలో ట్రాఫిక్ నియం త్రణలో భాగంగా నగరంలోని ఫ్లైఓవర్లను డిసెంబర్ 31వ తేదీ రాత్రి మూసివేస్తామని ప్రకటించారు. ప్రజలు ప్రత్యామ్నాయ మార్గా లను వినియోగించాలని సూచించారు. నగర భద్రతపై ప్రత్యేక దృష్టి సారించామని.. అన్ని ప్రాంతాల్లో సీసీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తామని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రతిక్షణం మానిటరింగ్ కొనసాగిస్తామని వివరించారు. గంజాయి, మత్తు పదార్థాలు సేవించినా లేదా వాటి అక్రమ రవాణా, విక్రయాలకు పాల్పడినా అరెస్టులు తప్పవని హెచ్చ రించారు. అసాంఘిక కార్యకలాపాలు, చట్ట విరుద్ధ చర్యలు ప్రజల దృష్టికి వస్తే వెంటనే డయల్ 112 నెంబర్‌కు ఫోన్ చేయాలని లేదా నేరుగా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రజల సహకారంతోనే శాంతియుతంగా నూతన సంవత్సర వేడుకలు సాధ్యమవుతాయని తెలిపారు. నూతన సంవత్సరంలో 'Say No to Drugs' అనే ఉద్దేశంతో ముందుకు వెళ్లాలని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. వేడుకల పేరుతో ప్రాణాలకు ముప్పు తెచ్చే చర్యలకు పాల్పడవద్దని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని విశాఖపట్నం సీపీ

# నిజాయితీకి నిలువుటద్దం సత్యనారాయణ

**- ఆభరణం (బంగారు గొలుసు) పోలీసులకు అప్పగింత - సత్యనారాయణ (పెద్దయ్య)ను అభినందించిన సీ.ఐ జి.ఏ.వి.రమణ, ఎస్సై కే.కిరణ్ కుమార్ నాయుడు**



**గజపతినగరం, (రాజధాని వార్తలు):** మనది కానిది మనకు ఎందుకు అనుకున్నారో, కష్టార్జితం కానిది కడగండ్లకు కారణభూతం అవుతుందనుకున్నారో, ఆభరణం అవతలి వాళ్లకు ఏ కష్టం తీర్చడానికి ఉపయోగపడేది అనుకున్నారో, వాస్తవంగా ఆ వస్తువు ఎవరిదో వారికే చెందాలన్న తలంపు, తాపత్రయంతో ఆ బంగారు గొలుసును గజపతినగరం పోలీసులకు అందజేసి మానవత్వం మంచితనం ఇంకా మచ్చుకైనా మిగిలి ఉన్నాయని సమాజానికి నిరూపించిన ఆ మహనీయుడే సత్యనారాయణ ఉరాఫ్ పెద్దయ్య. గజపతినగరం సబ్ ఇన్స్పెక్టర్ కే కిరణ్ కుమార్ నాయుడు విలేకరులకు అందించిన వివరాల ప్రకారం ఈ నెల 14వ తేదీన సాయంత్రం ఐదు గంటల సమయంలో మండలంలోని చిట్టయ్య వలస గ్రామానికి చెందిన సిరిపురపు సత్యనారాయణకు విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో సుమారుగా 17 గ్రాముల బరువు ఉన్న బంగారు పుస్తెల తాడు దొరికింది. వెంటనే సత్యనారాయణ గజపతినగరం సబ్ ఇన్స్పెక్టర్ కే.కిరణ్ కుమార్ నాయుడుకు ఈ విషయాన్ని తెలియజేశారు.సమాచారాన్ని ఎస్సై కిరణ్ కుమార్ నాయుడు వెంటనే ఉన్నత అధికారులు దృష్టికి తీసుకువెళ్లారు. సోమవారం సత్యనారాయణ బంగారపు పుస్తెలతాడును గజపతి నగరం పోలీస్ స్టేషన్కు తీసుకువచ్చి సర్కిల్ ఇన్స్పెక్టర్ జీఏవి రమణ, ఎస్.ఐ కే కిరణ్ కుమార్ నాయుడులకు అప్పగించాడు. గజపతినగరం సర్కిల్ ఇన్స్పెక్టర్ జి ఏ వి రమణ వెనువెంటనే ఈ విషయాన్ని విజయనగరం వన్ టౌన్ పోలీస్ స్టేషన్కు తెలియ పరచి అక్కడి పోలీసులకు అప్పగించారు. సత్యనారాయణను సర్కిల్ ఇన్స్పెక్టర్ జీఏవి రమణ, ఎస్సై కే.కిరణ్ కుమార్ నాయుడు అభినందించారు.

# కొత్త సంవత్సరం సందర్భంగా పరిమితులు దాటి ప్రవర్తించవద్దు

**- డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడితే జైలు శిక్ష - యువతను హెచ్చరించిన ఎస్.ఐ కే.కిరణ్ కుమార్ నాయుడు**



**గజపతినగరం, (రాజధాని వార్తలు):** కొత్త సంవత్సరము సం దర్భంగా యువత పరిమితులు దాటి ప్రవర్తించొద్దని ఎస్.ఐ కే కిరణ్ కుమార్ నాయుడు హెచ్చరించారు. నూతన సంవత్సర వేడుకల సంబరాల్లో యువకులు అత్యుత్సాహం ప్రదర్శించి ప్రమా దాలు కొని తెచ్చుకోవద్దని, మద్యం సేవించి పట్టుబడితే వారం రోజులు జైలు శిక్ష తప్పదని స్థానిక ఎస్సై కే.కిరణ్ కుమార్ నాయుడు హెచ్చరించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కొత్త సంవత్సరంనకు ఆహ్వానం పలుకుతూ.. పాత సంవత్సరంనకు వీడ్కోల ఆనందంలో యువత పరిమితులు దాటి ప్రవర్తించవద్దన్నారు. 31 రాత్రి విస్తృతంగా పోలీసు తనిఖీలు, వాహనాల తనిఖీలు ఉంటాయని, డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలలో దొరికితే వారం రోజులు జైలు శిక్ష తప్పదన్నారు. ప్రమాదాలు జరగకుండా నివారించేందుకు కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని ఆయన అన్నారు. అలాగే రహదారులపై అనవసరమైన బైక్ రైడింగ్లు, ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా ప్రవర్తించిన చర్యలు తప్పవని అన్నారు. తమ ఆదేశాలను దృష్టిలో ఉంచుకొని ప్రశాంత వాతావరణంలో నూతన సంవత్సర వేడుకలు సాంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని ఎస్సై కిరణ్ కుమార్ నాయుడు సూచించారు.

# ఇనాం భూములు అమ్ముకునే స్వేచ్ఛ ఇనాం రైతులకు కల్పించండి : భాగం గోపాలరావు డిమాండ్

**భీమునిపట్నం, (రాజధాని వార్తలు):** భీమిలి నియోజకవర్గంలో ఇనాం భూములు అమ్ముకునే హక్కును ఇనాం రైతులకు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని మాల మహానాడు వ్యవస్థాపక కార్యదర్శి బాగం గోపాలరావు పత్రికా ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇనాం భూములు స్వాతంత్రం రాక ముందు రాజులు, జమీందారులు ఆయా కులవృత్తులు బట్టి కంసాలి ఇనాం, మంగలి ఇనాం, చాకలి ఇనాం, బారిక ఇనాం పేర్లతో వారు సేవలు పొంది భూదానం చేశారు. భీమిలి నియోజకవర్గంలో సుమారుగా 1000 ఎకరాలు భూములు ఉన్నవి ఇనాం భూములు అమ్మకం ప్రభుత్వం నిలుపుదల చేయడం వల్ల ఇనాం రైతుల కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందుల పాలు అవుతున్నారని ప్రభుత్వం రైతులకు అమ్ముకునే స్వేచ్ఛ కల్పించాలని తద్వారా ఆ కుటుంబాలను ఆదుకోవాలని గోపాల రావు డిమాండ్ చేశారు. లేని పక్షంలో మండల కేంద్రాలలో రైతులతో ఆందోళన చేస్తామని పత్రికా ప్రకటన విడుదల చేశారు.



# ఘనంగా కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం

**అంబాజీపేట, (రాజధాని వార్తలు):** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట బస్టాండ్ వద్ద గల మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద ఏర్పాటుచేసిన కాంగ్రెస్ పార్టీ 141వ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమమును అంబాజీపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొమ్మేటి వినోద్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమమునకు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సభ్యులు మాచవరపు శివన్నారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొని కాంగ్రెస్ పార్టీ 141 వఆవిర్భావ దినోత్సవ సందర్భంగా పార్టీ పతాకావిష్కరణ చేసి కేక్ కట్ చేసి ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించినారు. ఈ సందర్భంగా శివన్నారాయణ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ దేశానికి చేసిన సేవలను కొనియాడినారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు దేశ ప్రజలకు ఉపయోగపడే నాగార్జునసాగర్ ప్రాజెక్టు, విశాఖ ఉక్కు కర్మాగారం, డి ఆర్ డి ఓ, శ్రీహరికోట వంటి ఎన్నో పరిశోధనా కేంద్రాలు నెలకొల్పి దేశ ప్రజలకు అంకితం చేశారన్నారు. ప్రస్తుతం నడుస్తున్న డబల్ ఇంజన్ ఎన్డీఏ సర్కార్ మాత్రం దోపిడీదారులకు, ఆర్థిక నేరస్తులకు కొమ్ముకాస్తుందని కాంగ్రెస్ పార్టీ విమర్శించింది. బిజెపి ప్రభుత్వం వచ్చి 12 సంవత్సరముల గడిచిన నరేంద్ర మోడీ ప్రధానిగా ఉన్నప్పటికీ మన రాష్ట్రానికి సంబంధించిన పోలవరం ప్రాజెక్టు ఇంతవరకు పూర్తి చేయలేకపోయిన అసమర్ధ ప్రభుత్వం దేశాన్ని పరిపాలిస్తుందని విమర్శించారు. దేశం అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ ప్రభుత్వం మరల అధికారంలోకి రావలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అన్నారు. 141 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సీనియర్ కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ ఇస్మాయిల్ షరీఫ్, ములపర్తి మోహన రావు మహిళా కాంగ్రెస్ నాయకురాలు కొల్లి సరోజిని మహమ్మద్ అబీబ్, బొంతు శివ, శ్రీ మట్టపర్తి వెంకటేశ్వరరావు మట్టపర్తి శ్రీను, యుగంధర్ ఇతరులు పాల్గొన్నారు.



# ఆర్.కృష్ణయ్య జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులుగా తుంగ నాగేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నిక



**పాలకొల్లు, (రాజధాని వార్తలు):** చట్ట సభలలో బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు 50 % శాతం అమలు చేయాలని స్థానిక సంస్థలలో బీసీలకు 42 శాతం సంచార జాతులకు 10 శాతం కలిపి మొత్తం 52 శాతం రాజకీయ రిజర్వేషన్లు మరియు ఏ. బి .సీ. డి. లుగా విభజించి అమలు చేయాలని ఆర్ కృష్ణయ్య జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముద్దాడ గణేష్ భవాని యాదవ్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆర్.కృష్ణయ్య జాతీయ బీసీ సంక్షేమ సంఘం సమావేశం స్థానిక గుంపర్రు గ్రామంలో రాష్ట్ర అధ్యక్షులు ముద్దాడ గణేష్ భవాని యాదవ్ అధ్యక్షతన జరిగింది ఈ సందర్భంగా గణేష్ భవాని మాట్లాడుతూ మన రాష్ట్రంలో 139 బీసీ కులాలుగా ఉంటూ కూల వృత్తులు, చేతి వృత్తులు, సంచార జీవితాలు గడుపుతున్న దారిద్రరేఖకు దిగువన ఉన్న బీసీ కులాలకు, చట్ట సభలో 50% రాజకీయ రిజర్వేషన్లు అమలు చేయాలని అని జన గణనలో కుల గణన పారదర్శకంగా చెయ్యాలని కూటమి ప్రభుత్వంకి ఆర్.కృష్ణయ్య జాతీయ బీసీ సంక్షేమ సంఘం తరుపున కోరుతున్నాము.అని గణేష్ భవాని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా గౌరవ అధ్యక్షులుగా తుంగ నాగేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పలువురు వ్యక్తులు మాట్లాడుతూ జన గణనలో కుల గణన పారదర్శకంగా చెయ్యాలని, స్థానిక సంస్థలలో రిజర్వేషన్ల పెంచి చట్ట భద్రత కల్పించిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం విజ్ఞప్తి చేస్తున్నాము అని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక విభాగ జిల్లా అధ్యక్షులు శిడగం రవి శేఖర్, పొన్నమండ ముత్యాలరావు, కట్టా ఆంజనేయులు, కట్టా నాగేశ్వరరావు మరియు వివిధ కుల సంఘాల నాయకులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# బహుజనుల సమస్యల పరిష్కారమే మా ధ్యేయం




**రేణిగుంట, (రాజధాని వార్తలు):** బహుజనుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనవిజయవంతం చేసిన ప్రతి ఒక్క బహుజనుడికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు, ప్రముఖ హైకోర్టు న్యాయవాది చింతమాకుల పుణ్యమూర్తి పేర్కొన్నారు. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివారం జరిగిన బహుజన ఆత్మీయ సమ్మేళనానికి ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి మద్దతుగా భారీగా తరలి వచ్చిన బహుజనులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. బహుజనులు ఇంకా సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో ఎదుర్కొంటున్న అన్యాయాలు, వివక్షాత్మక వైఖరిపై కఠిన పోరాటం కొనసాగుతుందని తెలిపారు. విద్యా అవకాశాలు, ఉద్యోగాల్లో న్యాయబద్ధమైన వాటా, సంక్షేమ పథకాల సరైన అమలు, అధికార వ్యవస్థలో సముచిత ప్రాతినిధ్యం వంటి ముఖ్య అంశాలపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ చూపిన సమానత్వ మార్గంలో బహుజనుల ఐక్యతే శక్తి, వారి హక్కుల సాధనకే ఈ సమ్మేళనాల లక్ష్యమని పుణ్యమూర్తి స్పష్టం చేశారు. బహుజనుల కోసం న్యాయపరమైన పోరాటం, ప్రజా ఉద్యమం రెండింటినీ సమాంతరంగా ముందుకు తీసుకెళ్తామని, ప్రతి బలహీన వర్గానికి న్యాయం జరిగే వరకు తాము పోరాడతామని స్పష్టం చేశారు. సమాజంలో సమాన హక్కులు, గౌరవం నెలకొనే దాకా పోరాటం కొనసాగుతుందని ఆయన తెలియజేశారు.

# సి.ఐ.టి.యు జాతీయ మహాసభలను విజయవంతం చేయండి

**- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు వి.లక్ష్మి**

**గజపతినగరం, (రాజధాని వార్తలు):**విశాఖపట్నంలో జనవరి 4న జరగనున్న సిఐటియు జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.లక్ష్మి కోరారు. సిఐటియు అఖిలభారత మహాసభలు విజయవంతం చేయాలని కోరుతూ గజపతినగరంలో సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి చంపావతి బ్రిడ్జి మీదగా పురిటిపెంట సచివాలయం వరకు బైక్ ర్యాలీ చేపట్టారు. ర్యాలీని ఉద్దేశించి సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు వి.లక్ష్మి మాట్లాడుతూ డిసెంబర్ 31వ తేదీ నుంచి జనవరి 4వ తేదీ వరకు ఆంధ్ర రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా సిఐటియు ఆల్ ఇండియా మహాసభలో జరుగుతున్నాయని తెలిపారు. ఈ మహాసభల్లో కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా లేబర్ కోడులకు వ్యతిరేకంగా దీర్ఘమైన చర్చ జరిపి కార్మిక హక్కులు చట్టాలను కాపాడుకోవడం కోసం నిర్ణయాలు చేయడం జరుగుతుందన్నారు. ఈ ర్యాలీలో




సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు పి.కోటి, కనకరాజు, భాస్కర్ రావు, మహంకాళి, కృష్ణ, వంశీ, జెరి రాము, సారీకి బంగారు నాయుడు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జి.శ్రీనివాసు, కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాకోటి రాములు పాల్గొన్నారు.

# తిరుపతి జిల్లా రైతు సంఘం ప్రథమ మహాసభ జయప్రదం




**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** శ్రీకాళహస్తి పట్టణంలోని రోటరీ క్లబ్ ఆవరణంలో సోమవారం తిరుపతి జిల్లా రైతు సంఘం ప్రథమ మహాసభ నిర్వహించారు. మొదటగా జెండా ఆవిష్కరణతో ప్రారంభమైన ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్ విచ్చేశారు. సభ నుద్దేశించి రాష్ట్ర ఉపాధ్యక్షులు రామానాయుడు మాట్లాడుతూ స్వామినాథన్ కమిషన్ సిఫారసులు మేరకు రైతులకు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, నకిలీ విత్తనాలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని, నిమ్మ జామాయిల్ రైతులకు గిట్టుబాటు ధరలు ఇవ్వాలని, 60 సంవత్సరాల పైబడిన ప్రతి రైతుకు 10,000 పెన్షన్ ఇవ్వాలని, కౌలు రైతులకు సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని, ఎరువులు విత్తనాలు ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేయాలని ఈ జిల్లా మహాసభలో తీర్మానం చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి నియోజకవర్గం కార్యదర్శి జనమాల గురవయ్య, చిన్ని రాజు, సుధాకర్ రెడ్డి, గోవింద రెడ్డి, పద్మనాభ రెడ్డి, రూరల్ మండల కార్యదర్శి మించల శివ కుమార్, పట్టణ కార్యదర్శి రెడ్డ గోపి, ఏఐటియుసి నియోజకవర్గ కార్యదర్శి మల్లికార్జున్, గూడూరు నియోజక కార్యదర్శి శశి, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు చారులత, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రవీణ్, సహాయ కార్యదర్శి మునిచెందు, ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ యం వెంకటాచలం, స్ట్రీట్ వెండర్స్ నాయకులు జనార్దన్, మురళి, రైతులు పాల్గొన్నారు.

# ఆద్యంతం రామ మయం

## - కన్నుల పండువగా.. రామయ్య నదీ విహారం
## - పులకించిన గోదారమ్మ - భక్త జనసంద్రంగా భద్రాద్రి




**భద్రాచలం, (రాజధాని వార్తలు):** హంసవాహనాలాంకార నౌకలో మంగళ వాయుద్య ఘోష.. వేద పారాయణం జరుగుతుండగా... రామయ్య సూర్య ప్రభ వాహనంపై వేంచేసి ఉండి ఒక వైపు భక్తులను అనుగ్రహిస్తూ... మరో వైపు పంచభూత ప్రసన్నంగా పవిత్ర గోదావరి నదిలో ఐదు సార్లు విహరించారు. అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు అయిన రామయ్య వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలలో భాగంగా దశావతారాలలో భక్తులకు దర్శనం ఇచ్చి సీతా లక్ష్మణ సమేతుడై నదీ విహారానికి రావడంతో గోదారమ్మ పులకించింది.

భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానం ఆధ్వర్యంలో జరుగుతున్న వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలలో భాగంగా డిసెంబర్ 20 నుండి దశావతారాలలో భక్తులను అనుగ్రహించిన రామయ్యకు పవిత్ర గౌతమీ నదిలో హంస వాహనంలో సూర్య ప్రభ వాహనంపై వేంచేసి ఉండగా తెప్పోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. సోమవారం ఉదయం నిత్య విధి అనంతరం పగల్ పత్తు సమాప్తి సూచకంగా పరకాల మునులు పరమ పదోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇప్పటి వరకూ జరిపిన పారాయణలను ఈ ఉత్సవం ద్వారా పరిసమాప్తి చేశారు. సాయంత్రం 4 గంటలకు వేద మంత్రాలు, మేళతాళాలు మంగళ వాయుధ్యాలు, భక్తుల కోలాటాలు,జయ జయ ద్వానాల నడుమ స్వామి వారు గోదావరి తీరం వద్దకు బయలుదేరారు. అక్కడ ప్రత్యేక పూజల అనంతరం సుందరంగా అలంకరించిన హంస వాహనంలో సూర్య ప్రభ వాహనంపై వేంచేపు చేశారు. అనంతరం పంచభూత ప్రసన్నంగా పవిత్ర గోదావరిలో ఐదు సార్లు, ఐదు ప్రాంతాలలో విహరించారు.స్వామి వారు హంస వాహనంలో విహరించే సమయంలో కాల్చిన బాణసంచా వెలుగులు దివిపై నుండి ముక్కోటి దేవతలు రంగు రంగుల పూల వర్షం కురిపిస్తున్నట్లు భ్రమింపజేసింది.ఈ వేడుకను తిలకించిడానికి సుదూర ప్రాంతాల నుండి వేలాది మంది భక్తులు భద్రాద్రి చేరుకోవడంతో భద్రాద్రి భక్తాద్రి గా మారింది. భద్రాచలం దివ్యక్షేత్రం భక్తుల శ్రీరామ నామ స్మరణతో మారుమ్రోగింది.

# అంగరంగ వైభవంగా దేవస్థాన పాలక మండలి ప్రమాణ స్వీకారం




**కొత్తపేట, (రాజధాని వార్తలు):** కోనసీమ తిరుపతిగా పేరుగాంచిన వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం పాలకమండలి ప్రమాణ స్వీకార మహోత్సవం కొత్తపేట నియోజక వర్గ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆధ్వర్యంలో సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. చైర్మన్‌గా ఆత్రేయపురం గ్రామానికి చెందిన ముదునూరి వెంకటరాజు (గబ్బర్ సింగ్) పాలక మండలి సభ్యులుగా 18 మంది నియమించబడగా దేవస్థాన డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రపాణి వారిచే ప్రమాణస్వీకారం చేయించారు. దిన దిన అభివృద్ధి చెందుతూ వాడపల్లి వెంకటేశ్వర స్వామి పుణ్యక్షేత్రం ఖ్యాతి దేశవ్యాప్తంగా వ్యాప్తి చెందడంతో గతంలో నియోజవర్గానికే పరిమితమైన సభ్యులను రాష్ట్ర వ్యాప్తంగా నియమించాలని ప్రభుత్వం ఆలోచన చేసింది. దాంతో ఒకానొక సమయంలో చైర్మన్ పదవి నియోజకవర్గంలో కాకుండా రాష్ట్రంలో ఇతర ప్రాంతానికి చెందిన వారికి కేటాయించే ఆలోచన చేశారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వద్ద పట్టుబట్టి చైర్మన్ పదవిని ముదునూరి వెంకటరాజుకు నియమించ కోవడంలో సఫలీకృతం అయ్యారు. ఆనందోత్సవాల మధ్య రెట్టింపు ఉత్సవంతో ఈ ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమాన్ని వేలాది మంది భక్తులు నాయకుల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమంలో ఎంపీ గంటి హరీష్ మాధుర్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు,ఏపీ బిల్డింగ్ అడ్వైసరీ కమిటీ చైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గుత్తుల సాయి, జనసేన ఇంచార్జి బండారు శ్రీనివాస్, జిల్లా బీజేపీ అధ్యక్షులు అడబాల సత్యనారాయణ, రాజోలు ఇంచార్జి గొల్లపల్లి అమూల్య,ఆకుల రామకృష్ణ, యువనాయకులు బండారు సంజీవ్ తదితర నాయకులు అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ ముదునూరి వెంకటరాజు గబ్బర్ సింగ్ సభ్యులకు టిడిపి సీనియర్ నాయకులు గుబ్బల మూర్తి శుభాకాంక్షలు తెలియజేస్తూ పాలక మండలి సభ్యులకు అభినందనలు తెలియజేశారు.

# సుపరిపాలన తొలి అడుగు - ఉత్తమ కార్యకర్తగా గండి సతీష్



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** 41 వార్డు చెందిన తెలుగుదేశం పార్టీకి చెందిన కార్యకర్త సుపరిపాలన తొలి అడుగు ఉత్తమ కార్యకర్తగా గండి సతీష్ కుమార్‌కి అభినందనలు తెలు పుతూ అవార్డు ప్రకటించారు. తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆరోగ్యశ్రీ చైర్మన్ సీతమ్మరాజు సుధాకర్ చేతుల మీదగా అవార్డుని ప్రధానం చేశారు. పార్టీలో చురుకైన పాత్ర పోషిస్తున్న ఇలాంటి కార్యకర్తలే పార్టీకి బలం అని సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో మీ కృషిని ఐటి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మిమ్మల్ని అభి నందిస్తూ మీ సేవలకు గుర్తింపుగా ఈ ప్రశంసాలు పత్రాన్ని అందజేస్తున్నారు. ఇకముందు కూడా ఇలాగే ప్రజాసేవలో ముం దుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు.

# కాంగ్రెస్ నాయకులు బట్టలు, పండ్లు వితరణ



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** కాంగ్రెస్ పార్టీ తూర్పు నియోజకవర్గ ఇంచార్జ్ ప్రియాంక దండి మద్రిపాలెం, 104 ఏరియాలో గల సాయి సుధా వృద్ధాశ్రమంలో పర్యటించి బట్టలు, పండ్లు పంచారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు, భవిష్యత్తులో ఏ సహాయం కావాలన్నా తమ వంతు సహకారం అందిస్తామని ప్రియాంక తెలిపారు.

ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాండవ గాయత్రి పాల్గొన్నారు.

# రెవెన్యూ క్లినిక్స్ ద్వారా ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కారం : జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి





**విజయనగరం, (రాజధాని వార్తలు):** పీజీఆర్ఎస్‌లో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ రోజు నుంచి జిల్లాలో రెవెన్యూ క్లినిక్స్ ప్రారంభించినట్లు జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి తెలిపారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ క్లినిక్స్ ద్వారా సాధ్యమైనంతవరకు రికార్డుల ఆధారంగా ఆన్ ది స్పాట్‌లోనే ఫిర్యాదులకు పరిష్కారం అందిస్తామని చెప్పారు. తహసీల్దార్లు, ఆర్డీవోలు సమక్షంలో పిటిషనర్లకు పరిష్కారం అందించడం లేదా ఫ్యాక్చువల్ సమాచారం ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అన్ని పిటిషన్లను డేటాబేస్‌లో నమోదు చేసి వీక్లీ రివ్యూ నిర్వహించి గరిష్ట సంతృప్తి సాధించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. గత 3-4 నెలల్లో జిల్లాలో పీజీఆర్ఎస్ సంతృప్తి ర్యాంకింగ్‌లో గణనీయమైన పురోగతి సాధించామన్నారు. పిటిషన్ల పరిష్కారానికి సాధారణంగా ఒక వారం టైమ్‌లైన్ నిర్ణయించినట్లు, కొన్ని ఆర్ ఓ ఆర్ కేసులు మినహా మిగతావన్నీ వేగంగా పరిష్కరిస్తూ ప్రజల సంతృప్తిని పెంచే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పెన్షన్లకు సంబంధించిన ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయని, అర్హత ఆధారంగా వెరిఫికేషన్ చేసి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, ఆర్డీవోలు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# అర్జీదారుల సంతృప్తి స్థాయి పెరగాలి

## - సచివాలయాలలో బయో మెట్రిక్ హాజరు తప్పనిసరి - నూర్చిన ధాన్యం మొత్తం కొనుగోలు చేయాలి : జిల్లా కలెక్టర్ ఎస్.రామ సుందర్ రెడ్డి




**విజయనగరం, (రాజధాని వార్తలు):** అర్జీదారుల వినతులు నాణ్యమైన, స్పీకింగ్ ఆర్డర్ రూపంలో సమాధానం ఇవ్వాలని, అర్జీదారుల సంతృప్తి పెరగాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి తెలిపారు. సోమవారం కలెక్టర్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో పిజిఆర్ఎస్‌పై సమీక్షించారు. పీజిఆర్ఎస్ వినతులు పై సమీక్షిస్తూ అర్జీదారుల సంతృప్తి స్థాయి పెరిగేలా పరిష్కారం ఉండాలని అధికారులకు సూచించారు. జిల్లా నుండి రెవిన్యూ వినతుల్లో ఎక్కువ శాతం తిరస్కారం అవుతున్నాయని, ప్రతి వినతును మరోసారి పరిశీలించాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లు వేగంగా జరగాలని, ప్రస్తుతం నూర్చిన ధాన్యం 30 వేల మెట్రిక్ టన్నుల వరకూ ఉన్నాయని, బుధవారం మొత్తం ధాన్యాన్ని సేకరించాలని తెలిపారు.

ఉగాది నాటికి గృహ ప్రవేశాలు ఉంటాయని, లక్ష్యాలను సాధించాలని తెలిపారు. 10 పరీక్షలపై దృష్టి పెట్టాలని, 100 రోజుల ప్రణాళిక అమలు చేసి శత శాతం ఫలితాలు వచ్చేలా చూడాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డి.ఆర్.ఓ మురళి, జిల్లా అధికారులు, వర్చువల్‌గా ఆర్.డిఓలు, మండల అధికారులు, మున్సిపల్ కమీషనర్లు పాల్గొన్నారు.

# భీమిలి అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయండి

## - నూతన కమిషనర్‌కి టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు విజ్ఞప్తి



**భీమునిపట్నం, (రాజధాని వార్తలు):** భీమిలి జోన్ అభివృద్ధికి నూతన ఆలోచనలు, ప్రణాళికలతో సిద్ధం కావాలని అందుకు భీమిలి ప్రజల సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు అన్నారు. భీమిలి జోనల్ కమీషనర్ గా బాధ్యతలు స్వీకరించిన టి.నాగేంద్ర కుమార్‌ను గంటా నూకరాజు, స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలసి శాలువా, పుష్పగుచ్ఛంతో శుభాకాంక్షలు తెలియజేసారు. అనంతరం గంటా నూకరాజు మాట్లాడుతూ భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు భీమిలి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే రోల్ మోడల్‌గా తయారు చేయాలనే లక్ష్య సాధనతో అడుగులు వేస్తున్నారని, నియోజకవర్గానికే భీమిలి జోన్ ఆదర్శమని అన్నారు. సుదీర్ఘ సముద్ర తీరప్రాంతం, విద్యా సంస్థలు, ప్రభుత్వ శాఖలు అన్నీ కూడా భీమిలి జోన్లో ఉన్నాయని అందువలన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆలోచనలు మేరకు నూతన ప్రణాళికలతో అడుగులు వేయాలని విజ్ఞప్తి చేసారు. భీమిలిలో ప్రధానంగా ఉన్న పలు అభివృద్ధి పనులు, చేయవలసిన పనులపై చర్చించి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు చురకల రమణ, కాసరపు నాగరాజు, మారోజు సంజీవ్ కుమార్, సంకురుబుక్త జోగారావు, జలగడుగుల మురళి, కొక్కిరి అప్పన్న, షేక్ అన్వార్, అప్పికొండ నూకరాజు, వియ్యపు పోతురాజు, రాజగిరి రమణ, శీరపు మహేష్, కుప్పిల గురుమూర్తి, నెక్కెళ్ళ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

# మక్కువలో సచివాలయాలను సందర్శించిన ఎంపీడీవో



**మక్కువ, (రాజధాని వార్తలు):** మండల కేంద్రం మక్కువలో గల 1&2 సచివాలయాలను ఎంపీడీవో అర్జునరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది పనితీరు పరిశీలించారు. సర్వేలు సకాలంలో పూర్తయ్యేలాగా కృషి చేయాలని తెలియజేశారు. సిబ్బంది బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి అని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యనిర్వహణ అధికారి బి. శ్రీనివాసరావు మరియు రెండు సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

# సంపాదకీయం

## పదేపదే అదే ప్రశ్న.. దేవుడున్నాడా


'దేవుడు ఉన్నాడా?' అనేది ఒక అనాది ప్రశ్న, కొనసాగుతున్న మీమాంస. ప్రముఖ కవి, మేధావి జావేద్ అఖ్తర్- ఇస్లాం పండితుడు ముఫ్తీ షామైల్ నాడ్వి మధ్య ఇటీవల ఆ ఎడతెగని ప్రశ్నపై చర్చ జరిగింది. ఆ చర్చలో పాల్గొనవలసిందిగా నన్నూ ఆహ్వానించారు. నేను నిరాకరించాను. ఆ సమయంలో నేనేమీ వేరే వ్యాపకాలలో తలమునకలై లేను. అసలు ఆ అంశంపై చర్చ అర్థరహితమని నా సునిశ్చితాభిప్రాయం. న్యూస్ చానెల్ 'ది లల్లన్‌టాప్'లో యాంకర్ సౌరభ్ ద్వివేది నిర్వహించిన ఆ చర్చ చాలా ఆసక్తికరంగా జరిగింది. విశేష ప్రతిస్పందనలకు ఆస్కారమిచ్చిన అసాధారణ చర్చ అది, సందేహం లేదు. అయితే ప్రజాదరణ అనేది ఔచిత్యానికి రుజువు కాదు. మరింత స్పష్టంగా చెప్పాలంటే మౌలిక మార్పులకు దోహదం చేసేది కాదు. ముఫ్తీ సాహెబ్‌తో నాకు పరిచయం లేదు. దైవం ఉనికిపై చర్చలో పాల్గొనేందుకు ఒక మతాచార్యుడికి సహేతుకమైన కారణాలు ఉంటాయి. అయితే జావేద్ సాహెబ్ అటువంటి చర్చలో పాల్గొనేందుకు ఎందుకు అంగీకరించారో నేను అర్థం చేసుకోలేకున్నాను. జావేద్ నాకు తెలుసు. ఆయన పట్ల నాకు గౌరవాదరాలు ఉన్నాయి. అయితే దేవుడికి వ్యతిరేకంగా జరుగుతున్న ఈ లౌకికవాద ధర్మయుద్ధంలో తన సృజనాత్మక శక్తి సామర్థ్యాలను ఎందుకు వినియోగించదలుచుకున్నారు? ఉత్కృష్టమైన రసానందాన్ని కలిగించే సినిమా పాటల స్రష్టగానే కాకుండా, అభ్యుదయ కవిగా కూడా ఆయన నాకూ, ఎంతో మందికి అభిమానపాత్రుడు. హిందీ, ఉర్దూ సాహిత్య ప్రపంచాలను ప్రగతిశీల భావకాంతులతో ప్రకాశవంతం చేసిన అభ్యుదయ సాహిత్య సంప్రదాయాలకు ఆయన సమున్నతమైన ప్రతినిధి. మత విద్వేషాలు, జాతీయవాద సంకుచితత్వాలకు వ్యతిరేకంగా జరుగుతోన్న పోరాటంలో ఆయనది ప్రభావశీలమైన గొంతుక. జాతిజనులు తమ 'గుండెలలో ఘూర్ణిల్లగ... పాడుకుంటున్న' ఆయన 'ఏక్ హమారి ఔర్ ఏక్ ఉన్కి/ ముల్క్ మే హై ఆవాజెయిన్ దో' గీతం నాకు నిరంతర స్ఫూర్తి. ముస్లింల మత సంకుచితత్వం, హిందూ దురహంకారానికి వ్యతిరేకంగా స్థిర వైఖరితో, సాహసోపేతంగా పోరాడుతున్న కవి, మేధావి జావేద్ సాహెబ్. ఈ కారణంగానే 'దేవుడు ఉన్నాడా?' అన్న అంశంపై ఆయన చర్చలో పాల్గొనడం నాకు నిరుత్సాహాన్ని కలిగించింది. నేనూ ఆయన వలే అవిశ్వాసుల సమూహంలోని వాణ్ణే. ఆయనవలే రెండోతరం అజ్ఞేయతావాదిని. మా నాన్నగారు హేతువాది. మతపరమైన ఎలాంటి ప్రమేయం లేకుండా తన జీవిత వ్యవహారాలను నడుపుకున్న మనిషి. మా అమ్మగారు కూడా మతపరమైన ఆచారాల పట్ల తీవ్ర విముఖత చూపేవారు. వ్రతాలు, పూజలకు మా అమ్మమ్మ ఇచ్చే ప్రాధాన్యం ఆమెకు ఎంత మాత్రం నచ్చేదికాదు. నా పెంపకంలో మతపరమైన ప్రభావం లేదని మరి చెప్పనవసరం లేదు. నా సతీమణి హిందూ మతాచారాలను నిష్ఠగా పాటిస్తుంటుంది. అయినా నా అజ్ఞేయతావాద (భౌతికంగా కనిపించిందే తెలుసుకోదగినదనినమ్మే వాదం) విశ్వాసాలు ఏ మాత్రం సడల లేదు. ఈనాటి భారతదేశంలో 'దేవుడు ఉన్నాడా?' అన్న విషయమై బహిరంగ చర్చకు అర్థవంతమైన ప్రాధాన్యమున్నదని నేను భావించడం లేదు. అటువంటి చర్చలో ఒకవైపు తరచూ దైవ విశ్వాసుల మూఢ వాదం, మరోవైపు నాస్తికుల అజ్ఞానం, అహంకారం వ్యక్తమవడం పరిపాటిగా ఉన్నది. మరింత ఘోరమైన విషయమేమిటంటే 'దేవుడు ఉన్నాడా?' అన్న చర్చ వర్తమాన భారతదేశంలో మతం, మతతత్వంపై జరగవలసిన చర్చల నుంచి మన దృష్టిని మళ్లించేదిగా ఉంటోంది. భగవంతుడి ఉనికిపై చర్చలు ఎల్లప్పుడూ అల్పమైనవిగానూ, అప్రధానమైనవిగానూ లేవు. ఆ ప్రశ్న ప్రగాఢమైన తాత్విక ప్రశ్నలకు దారి తీసిన సందర్భాలు చరిత్రలో చాలా ఉన్నాయి. దేవుడు ఉన్నాడు అంటే అర్థమేమిటి? దేవుడు ఉన్నట్టయితే మన జీవితాలలో ఇంత చెడు ఎందుకు ఉంది? దేవుని రూపం ఏమిటి? లేక ఆయన నిరాకారుడా? అన్న ప్రశ్నలు సహజంగానే చర్చకు వస్తాయి. ప్రాచీన భారతీయ దార్శనికులు ఈ ప్రశ్నలపై లోతైన చర్చ జరిపారు.. సాంఖ్య, న్యాయ దర్శనాలే అందుకు నిదర్శనాలు. అసలు దేవుడే లేడని చార్వాకులు వాదించారు. ఐరోపాలోని ప్రజలు ఆధునిక యుగారంభం నుంచి హేతుబద్ధంగా దేవుడి ఉనికిని, మత విశ్వాసాలను ప్రశ్నించారు. తర్కబద్ధంగా వాద ప్రతివాదాలు జరిగాయి. ఇవి ఆధునిక రాజకీయ, సామాజిక చింతనను పురిగొల్పాయి. నవీన భావాలకు, జ్ఞాన వికాసానికి విశేషంగా తోడ్పడ్డాయి. ఇందుకు కారణం పరస్పరం విభేదించుకుంటున్న వారి భాగస్వామ్య తాత్విక అంచనాలు. ఉమ్మడిగా ప్రగాఢ తాత్విక భావనలు లేని ఆస్తికులు, నాస్తికుల మధ్య చర్చలు ఆవేశపరుస్తాయేగానీ ఆలోచనాత్మకంగా జరగవు. వాడీ వేడిగా జరుగుతాయేగానీ వెలుగునివ్వని చర్చలుగానే అవి ఉండిపోతాయి. అయితే ఇటువంటి వాద ప్రతివాదాలు విప్లవాత్మకంగా పరిణమించిన సందర్భాలు కూడా చరిత్రలో ఉన్నాయి. విశ్వానికి భూమే కేంద్రం అన్న చర్చి నిర్దేశానికి వ్యతిరేకంగా గెలీలియో సహేతుకమైన వాదనలు చేసి సూర్య కేంద్ర విశ్వ భావనను నెలకొల్పారు. హిందూ దేవతల గాథలను జ్యోతిబాఫూలే నిశితంగా ప్రశ్నించారు. దైవ భావనపై రామస్వామి నాయకర్ తిరుగుబాటు సామాజిక నిరంకుశత్వాలను కూల్చివేసింది. నేడు దైవ భావనపై దాడి అటువంటి ప్రగతిశీల ప్రయోజనాలను సాధించలేదు. ఎందుకంటే వర్తమాన ప్రపంచంలో మతానికి సామాజిక పరపతిగానీ, సత్యంపై గుత్తాధిపత్యంకానీ లేవు. నేడు విజ్ఞాన శాస్త్రం, హేతువాదం ఆలంబనకు మతం ఆరాటపడుతోంది. భగవంతుడిపై విమర్శలు నేటి అమానుష సామాజిక, రాజకీయ అసమానతలను ప్రశ్నించేవిగా లేవు, ఉండడం లేదు. దేవునికి వ్యతిరేకంగా వెల్లువెత్తుతున్న విమర్శలు, మన కాలంలో మతం, మతతత్వం మూలంగా ప్రబలుతున్న నిజమైన, తక్షణ సమస్యల నుంచి మన దృష్టిని మళ్లిస్తున్నాయి.

# ఘనంగా ప్రారంభమైన స్టార్ అభిరుచి పలావ్ & బిరియాని రెస్టారెంట్

**- దక్షిణ ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్ చేతుల మీదుగా ప్రారంభం**

**- ముఖ్య అతిధులుగా హాజరైన ఆళ్ళ శ్రీను, ఆకిరెడ్డి జగదీశ్**





**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** జనసేన పార్టీ విశాఖ పట్నం నగర అధ్యక్షులు, దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ దొండపర్తి జంక్షన్ వద్ద స్టార్ అభిరుచి పలావ్ & బిరియాని రెస్టారెంట్‌ను ప్రారంభించారు. విశాఖ నగరంలో బిర్యానీ పట్ల యువత ఎంతో మక్కువ చూపెడతారని, మంచి క్వాలిటీతో రుచికరమైన బిర్యాని అందించి, క్వాలిటీ మేనేజ్ చేయాలని తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో 42వ వార్డు కూటమి నాయకులు ఆళ్ళ శ్రీనివాస్, ఆకిరెడ్డి జగదీష్ ఈ యొక్క కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొనగా కూటమి కార్యకర్తలు, బిర్యానీ పాయింట్ నిర్వాహకులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి కర్రసాము పోటీల్లో సత్తా చాటిన నారాయణ విద్యార్థి రిషి











**నెల్లూరు, (రాజధాని వార్తలు):** రాష్ట్ర స్థాయిలో జరిగిన సిలంబం (కర్రసాము) పోటీల్లో నెల్లూరు నారాయణ స్కూల్ విద్యార్థి పాముల రిషి సత్తా చాటారు. మూడో స్థానంలో నిలిచి నెల్లూరు పేరును రాష్ట్ర స్థాయిలో నిలబెట్టారు. నెల్లూరులోని సోమిశెట్టి వారి కళ్యాణ మండపంలో ఆదివారం సిలంబం అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి సిలంబం (కర్రసాము) పోటీలు-2025 జరిగాయి. ఈ పోటీల్లో బాలాజీనగర్ నారాయణ స్కూల్ 9వ తరగతి విద్యార్థి పాముల రిషి పాల్గొన్నారు. ఎన్‌కెటి స్పోర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకలు మరియు కోచ్ మాస్టర్ ఆంజనేయులు సారధ్యంలో శిక్షణ పొందిన పాముల రిషి డబుల్ స్టిక్ విభాగంలో పాల్గొని రాష్ట్ర స్థాయిలో మూడో స్థానంలో నిలిచారు. పోటీల అనంతరం నిర్వాహకులు మెడల్‌తో పాటూ సర్టిఫికేట్‌ను అందజేశారు. మరో వైపు పాముల రిషీ రాష్ట్ర స్థాయిలో మూడో స్థానంలో నిలిచి, మెడల్ సాధించినందుకు నారాయణ విద్యా సంస్థల యాజమాన్యం శుభాకాంక్షలు తెలియజేసింది. సోమవారం బాలాజీనగర్ స్కూల్‌లో ప్రిన్సిపల్ వందనా రెడ్డి, అకడమిక్ డీన్ సురేంద్రలు రిషిని అభినందించి సత్కరించారు. నారాయణ విద్యాసంస్థలు చదువుతో పాటూ క్రీడలకు కూడా ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు. కర్రసాము రాష్ట్ర స్థాయి పోటీల్లో పాముల రిషి మూడో స్థానంలో నిలవడమే ఇందుకు నిదర్శనమన్నారు. రిషీ జాతీయ స్థాయిలో కూడా రాణించాలని కాంక్షించారు.

# వేళంగి కొళాయి చెరువు వేలంపై ఆర్ టీ ఐ అప్పీల్

**- 10 రోజుల్లో సమాచారం ఇవ్వాలని ఎంపీడీఓ ఆదేశాలు**



**కరప, (రాజధాని వార్తలు):** కాకినాడ రూరల్ కరప మండలం, వేళంగిలో ఉన్న సీపిడబ్ల్యూ ఎస్ వాటర్ ప్రాజెక్టుకు సంబంధించిన కొళాయి చెరువు వేలం ప్రక్రియపై సమాచారం కోరుతూ దాఖలైన ఆర్టీఐ అప్పీల్‌లో కరప మండల ఎంపీడీఓ కీలక ఆదేశాలు జారీ చేశారు. గ్రాడ్యుయేట్స్ యూత్ ప్రతినిధి ఎర్ర విక్రమ్ అక్టోబర్ 9న వేళంగి గ్రామ పంచాయతీ ప్రజాసమాచార అధికారికి ఆర్ టీ ఐ దరఖాస్తు సమర్పించారు. ఆర్ టీ ఐ చట్టం-2005 ప్రకారం నిర్ణీత గడువులో సమాచారం అందించకపోవడంతో డిసెంబర్ 6న కరప ఎంపీడీఓ కార్యాలయంలో అప్పీల్ దాఖలు చేశారు. ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన అప్పీల్ హియరింగ్‌లో ఎర్ర విక్రమ్ హాజరయ్యి. విచారణ అనంతరం అప్పీల్ అధికారి ఎంపీడీవో జటావల్లభుల శ్రీనివాస్ వేళంగి గ్రామపంచాయతీ ప్రజా సమాచార అధికారికి 10 రోజుల్లోపు పూర్తి వివరాలు అందించాలని ఆదేశించారు.

# స్పెల్ బి పోటీలలో జిల్లాలో మొదటి స్థానంలో నిలిచిన శివ కార్తీక్

**- త్వరలో జరగనున్న జోనల్ స్థాయి పోటీలకు శివ కార్తీక్ ఎంపిక**




**అల్లవరం, (రాజధాని వార్తలు):** అంబేద్కర్ కోనసీమ జిల్లా స్థాయిలో జరిగిన స్పెల్ బి (వర్డ్స్ స్పెల్లింగ్)పోటీలలో అంబేద్కర్ కోనసీమ జిల్లా దేవగుప్తం ఉన్నత పాఠశాల కుంచెందిన ఆరవ తరగతి విద్యార్థి కోలా లీలా శివ కార్తీక్ ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచాడు. త్వరలో జరగనున్న జోనల్ స్థాయి స్పెల్ బి పోటీలకు శివ కార్తీక్ ఎంపికైనట్లు తర్ఫీదు ఇస్తున్న ఆంగ్ల ఉపాధ్యాయుడు ఎం బాల శంకరరావు, కె సాయి సుబ్బలక్ష్మిలు తెలిపారు. విద్యార్థులలో ఆంగ్ల భాష నైపుణ్యాన్ని పెంపొందించుకునేందుకు ఎన్ సిఈఆర్‌టి ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన శివ కార్తీక్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎన్ వేణు గోపాల స్వామి, విద్యా కమిటీ సభ్యులు అభినందించారు.

# "యర్నాకులం" ప్రయాణీకులు సామర్లకోట తరలింపు...!

**- ప్రమాదం నుంచి బయటపడ్డ 144 మంది ప్రయాణీకులు - 3 ప్రత్యేక బోగీలు ఏర్పాటు**








**సామర్లకోట, (రాజధాని వార్తలు):** ఎలమంచిలిలో టాటా నగర్ - యర్నాకులం రైలుకు మంటలు వ్యాపించిన సంఘటనలో 144 మంది ప్రయాణీకులను ఆర్టీసి బస్సులో కాకినాడ జిల్లా సామర్లకోట రైల్వే స్టేషన్‌కు తరలించి ఆపై వారిని ప్రత్యేక బోగీల్లో పంపించారు. ఎలమంచిలి రైల్వే స్టేషన్ వద్ద టాటా నగర్ నుంచి ఎర్నాకులం వెళుతున్న సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలుకు సోమవారం తెల్లవారుజామున అగ్ని ప్రమాదం సంభవించింది. ప్యాంట్రీ కార్ తరువాత ఉన్న మూడు భోగిల్లో మంటలు వ్యాపించగా ప్రయాణికులంతా అప్రమత్తమవడంతో 144 మంది ప్రయాణికులు ప్రమాదం నుంచి బయటపడ్డారు. దానితో ఎలమంచిలి రైల్వే స్టేషన్‌లో రైలును నిలిపివేయగా ప్రమాదం నుంచి బయటపడిన 144 మంది ప్రయాణికులను అధికారులు ప్రత్యేక ఆర్టీసీ బస్సులో కాకినాడ జిల్లా సామర్లకోట రైల్వే స్టేషన్‌కు తరలించారు. రైల్వే అధికారులు, ఎలమంచిలి, సామర్లకోట రైల్వే పోలీసులు, సామర్లకోట ట్రాఫిక్ పోలీసులు కలసి పెద్దాపురం డి.ఎస్.పి డి శ్రీహరి రాజు పర్యవేక్షణలో ప్రయాణికులను సురక్షితంగా సామర్లకోట రైల్వే స్టేషన్‌కు తరలించారు. ప్రయాణీకుల్లో పిల్లలు, పెద్దలు, వృద్ధులు సైతం ఉండటంతో ఈ సందర్భంగా వారందరికీ అధికారులు అల్పాహారాన్ని ఏర్పాటు చేసి వారి యోగక్షేమాలను పర్యవేక్షించారు. తదుపరి ఎలమంచిలి నుంచి ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్ రైలుకు ఉన్న ప్రమాదం జరిగిన మూడు భోగిలను తొలగించి వాటిని ఎలమంచిలి స్టేషన్‌లోనే ఉంచి వాటి స్థానంలో మరొక మూడు ప్రత్యేక భోగిలను ఏర్పాటుచేసి రైలును సామర్లకోటకు నడిపించారు. ఉదయం 9 గంటలకు సామర్లకోట స్టేషన్కు చేరుకున్న ఎర్నాకులం రైలులో ప్రమాదానికి గురైన భోగిలకు సంబంధించి మార్పు చేసిన భోగిలకు నంబర్లు అతికించి పోలీసులు, రైల్వే అధికారుల సమక్షంలో ప్రయాణికులందరినీ సురక్షితంగా ప్రత్యేక భోగిల్లో ఎక్కించారు. అనంతరం 9:30 గంటలకు రైల్వే అధికారులు పోలీసులు ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్‌కు సిగ్నల్ అందించి ముందుకు పంపించారు.

**అధికారుల సహకారం అభినందనీయం :**

రైలు భోగిలో మంటలు వ్యాపించిన ఘటనలో ఎలమంచిలి సామర్లకోట రైల్వే అధికారులు, పోలీస్ సిబ్బంది అందించిన సేవలు అభినందనీయమని ప్రయాణికులు అన్నారు. ప్రమాదం సంభవించిన సమయం నుంచి తిరిగి తమ ప్రయాణం కొనసాగే వరకు అధికారులు తమ వెంట ఉండి, తమకు ధైర్యాన్ని చెబుతూ మా యోగక్షేమాలను తెలుసుకోవడంతోపాటు అన్ని విధాల సహకరించినట్టు ప్రయాణికులు తెలిపారు.

ఎవరికి ఎలాంటి చిన్న ప్రమాదం కూడా జరగకుండా బయటపడడం ప్రయాణికు లందరూ అదృష్టమని చెబుతూ వారు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కాగా సామర్ల కోట స్టేషన్లో రైల్వే ఎస్ఎం ఎం రమేష్‌తో పాటు, స్టేషన్ అధికారులు, స్థానిక సీఐ ఏ కృష్ణ భగవాన్, జిఆర్పి, ఆర్పిఎఫ్, ట్రాఫిక్, లాండ్ ఆర్డర్ ఎస్సైలు అడపా గరగారావు, మూర్తి, సిబ్బంది ప్రయాణికులకు విశేష సేవలను అందించారు.

# టికెట్ రేట్లు కాదా?..బలం లేని కథలే కారణమా?



టాలీవుడ్‌లో గత కొన్నేళ్లుగా మోనోపలి చేస్తున్న వాళ్లు కొందరు అంటున్న మాట స్టార్ స్టేటస్, ప్రేక్షకుల్ని థియేటర్లకు రప్పించే సత్తా ఉన్న సినిమా అయితేనే దానికి థియేటర్లు లభిస్తాయని, అలా కాకుండా ఊరూ పేరూ లేని వారితో సినిమాలు చేస్తే దాన్ని రిలీజ్ చేయడం కష్టమని, అలాంటి సినిమాల కోసం ప్రేక్షకులు థియేటర్లకు రారని స్టేట్‌మెంట్‌లు ఇచ్చారు. చిన్న సినిమాలని ఆదిలోనే తొక్కేయడం మొదలు పెట్టారు. కానీ ఇప్పుడు మాత్రం వాటి వెనకే పడుతూ నచ్చిన సినిమాకు ఎలాంటి డబ్బులు పెట్టకుండా థియేటర్లలో రిలీజ్ చేసి లాభాల్లో వాటాలు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు డి.సురేష్ బాబు సైక్ సిద్ధార్థ్ ప్రెస్‌మీట్‌లో చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ప్రేక్షకులు థియేటర్లకు దూరం కావడం లేదని, పరిశ్రమే వారిని దూరం చేసుకుంటోందన్నారు. మంచి కంటెంట్‌తో వస్తే తప్పకుండా ఆదరిస్తున్నారని, అందుకు లిటిల్ హార్ట్స్, రాజు వెడ్స్ రాంబాయి, కోర్ట్ లాంటి సినిమాలే ఉదాహరణ అని పేర్కొన్నారు. కథాబలం లేకుండా నిర్మించే సినిమాల వల్ల ఇండస్ట్రీకే కాకుండా ప్రేక్షకులకు నష్టం వాటిల్లుతోందన్నారు. అంతేకాకుండా నంద హీరోగా వరుణ్‌రెడ్డి రూపొందించిన సైక్ సిద్ధార్థ్ ప్రేక్షకుల అభిరుచికి అనుగుణంగా ఉండటం వల్లే తాను ఈ చిత్రాన్ని ప్రోత్సహిస్తున్నానని తెలిపారు. డి. సురేష్ బాబు వ్యాఖ్యల నేపథ్యంలో ఆసక్తికరమైన చర్చ ఒకటి మొదలైంది. పెరిగిన టికెట్ రేట్ల కారణంగా సగటు ప్రేక్షకులు థియేటర్లకు రావడం లేదనే చర్చ జరుగుతున్న వేళ సురేష్ బాబు బలంలేని కథల కారణంగానే ప్రేక్షకులు థియేటర్లకు రావడం లేదనడం ఆసక్తికరంగా మారింది. గతంలో సినిమా ఎలా ఉన్నా, ఫ్లాప్ సినిమా అయినా సరే ప్రేక్షకులు థియేటర్లకు వచ్చేవారు. స్టార్ హీరో సినిమా అయినా సరే ఫ్లాప్ అని తెలిసినా ప్రేక్షకులు థియేటర్లకు వచ్చిన సందర్భాలు చాలానే ఉన్నాయి. కానీ ఇప్పుడు ప్రేక్షకులు థియేటర్లకు రావడం లేదు. ఎంత మంచి సినిమా అని ప్రచారం చేసినా ఆశించిన స్థాయలో టికెట్‌లు తెగడం లేదు. కారణం సామాన్యుడు భరించలేని స్థాయిలో టికెట్ రేట్లు పెరగడమే. ఆ కారణంగానే థియేటర్లకు ప్రేక్షకులు రావడం రికార్డు స్థాయిలో తగ్గించారు. దీంతో ఇండస్ట్రీ తీవ్ర ఇబ్బందుల్ని ఎదుర్కొంటోంది.


ఒక దశలో ఫ్లాప్ సినిమా అయినా సరే చూడటానికి థియేటర్లకు వచ్చిన ప్రేక్షకులు ఇప్పుడు రావడానికి ఆసక్తిని ప్రదర్శించకపోవడం టికెట్ రేట్లేనని అందరికీ తెలుసు. కానీ దీని గురించి ఎవరూ మాట్లాడకుండా, కథాబలం లేని సినిమాల వల్లే ఇండస్ట్రీకి ప్రేక్షకులు దూరమవుతున్నారని ఇండస్ట్రీ పెద్దలు చెప్పడం హాస్యాస్పదంగా ఉందని పలువురు కామెంట్‌లు చేస్తున్నారు. కంటెంట్ ఓకే కానీ టికెట్ రేట్లని అదుపు చేయాలనే ఆలోచన చేస్తేనే ఇండస్ట్రీ మళ్లీ పుంజుకుంటుందని, భారీ బడ్జెట్లతో సినిమాలు చేశామని ఒకటి రెండు వారాలు టికెట్ రేట్లు పెంచేస్తామనడం కరెక్ట్ కాదని, ఈ విషయంలో ధురంధర్‌ని చూసి మన వాళ్లలో మార్పు రావాలని సెటైర్లు వేస్తున్నారు.

# సన్నీ లియోన్ షో... కృష్ణుడి జన్మభూమి వివాదం



ఇండియన్ సినీ ప్రేక్షకుల్లో సన్నీ లియోన్‌కి ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఒకప్పుడు ఆమె ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు దక్కించుకుంది. కానీ గత దశాబ్ద కాలంగా పూర్తిగా ఇండియన్ సినిమాలకు పరిమితం అయింది. ఆమె సినిమాల్లో చేసే పాత్రలు, చేసే డాన్స్‌ల కారణంగా కొందరు ఆమెను ఒక రకంగా అనుకుంటే ఆమె వ్యక్తిగతం మాత్రం పూర్తి విభిన్నంగా ఉంటుంది. ఆమె మంచి మనసున్న వ్యక్తి అని చాలా సార్లు నిరూపితం అయ్యింది. హీరోయిన్‌గా సన్నీ లియోన్ ప్రస్తుతం చేస్తున్న సినిమాలు ఎక్కువ లేవు. కానీ ఆమె ఎప్పటికప్పుడు స్టేజ్ షోలు చేయడం ద్వారా అభిమానులను ఆకట్టుకుంటూనే ఉంటుంది. ముఖ్యంగా ఈమెతో న్యూ ఇయర్ పార్టీలను ఏర్పాటు చేసేందుకు పెద్ద ఎత్తున సంస్థలు ముందుకు వస్తూ ఉంటాయి. ఈసారి ఈమె న్యూ ఇయర్ పార్టీ మధురలో ప్లాన్ చేశారు. భారీ ఎత్తున ఈమెకు పారితోషికం ఇచ్చి మరీ ఒక హోటల్ యాజమాన్యం వారు ఈమెను హైర్ చేసుకున్నారు. మధురలోని ఆ స్టార్ హోటల్ యాజమాన్యం కేవలం 300 మంది ఆడియన్స్‌తో ఈ పార్టీని ఏర్పాటు చేసేందుకు రెడీ అయింది. రేంజ్ కి తగ్గట్లుగా టికెట్ల రేట్లను నిర్ణయించారు. ఇప్పటికే బుకింగ్ కూడా క్లోజ్ అయింది. ఇలాంటి సమయంలో సన్నీ లియోన్ కార్యక్రమంను రద్దు చేస్తున్నట్లుగా హోటల్ యాజమాన్యం అధికారికంగా ప్రకటించింది. అంతేకాకుండా ఇప్పటికే టికెట్లు బుక్ చేసుకున్న వారికి రిఫండ్ ఇవ్వనున్నట్లుగా తెలుస్తోంది. మధురలో సన్నీ లియోన్ కార్యక్రమంను రద్దు చేయడం వెనుక సాధువులు ఉన్నారని, పెద్ద ఎత్తున హిందూ సంఘాల వారి ఆందోళన పని చేసిందని తెలుస్తోంది. సన్నీ లియోన్ ను పూర్తి అనుమతులతో తీసుకు వచ్చేందుకు హోటల్ యాజమాన్యం ఏర్పాట్లు చేసింది. అయినా కూడా ఎందుకు చివరి నిమిషంలో కార్యక్రమాలు రద్దు చేయాల్సి వచ్చింది అనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఈ సంఘటన పూర్తి వివరాల్లోకి వెళ్తే... సన్నీ లియోన్ వంటి శృంగార తారతో హిందువులు పవిత్రంగా భావించే మధురలో డాన్స్ కార్యక్రమం చేయించడం ఏమాత్రం కరెక్ట్ కాదని హిందూ సంఘాల వారు అంటున్నారు. పలువురు సాధువులు, హిందూ సంఘాల నాయకులు స్థానిక కలెక్టర్‌తో పాటు ప్రభుత్వ అధికారులకు ఫిర్యాదు చేయడం జరిగింది. కాదు కూడదు అని కార్యక్రమంను నిర్వహించే ప్రయత్నం చేస్తే జరిగే పరిణామాలకు తమను బాధ్యులు చేయకూడదు అంటూ హిందూ సంఘాల వారు, సాధువులు హెచ్చరించారట. దాంతో ఇచ్చిన అనుమతిని వెనక్కి తీసుకోవడంతో పాటు, హోటల్ యాజమాన్యంకు నోటీసులు ఇచ్చి కార్యక్రమంను అడ్డుకున్నారని తెలుస్తోంది. శ్రీకృష్ణుడి జన్మభూమిగా మధురను హిందువులు భావిస్తూ ఉంటారు. అలాంటి పవిత్రమైన స్థలంలో సన్నీ లియోన్ వంటి తారలతో అశ్లీల నృత్యాలు చేయించడం అనేది హిందూ ధర్మంను అవమానించడం అవుతుందని అంతా భావించారు. ఈ విషయమై హోటల్ యాజమాన్యం సైతం సానుకూలంగా స్పందించింది. హిందువుల మనోభావాలను దెబ్బ తీసే ఉద్దేశం తమకు లేదని, సన్నీ లియోన్‌ను ఒక సాధారణ నటిగానే తాము పార్టీకి తీసుకు వచ్చే ప్రయత్నం చేశాము. ఆమె విషయంలో వ్యతిరేకత వస్తే కచ్చితంగా అందరి మనోభావాలను గౌరవించే విధంగా నిర్ణయం తీసుకుంటామని చెప్పుకొచ్చారు. అంతే కాకుండా యాజమాన్యం కొత్త సంవత్సరం పార్టీ విషయంలో తాము తీసుకున్న నిర్ణయం వెనక్కి తీసుకోవడం మాత్రమే కాకుండా భవిష్యత్తులో ఇలాంటివి మరోసారి పునరావృతం కాకుండా చూస్తామని కూడా హామీ ఇచ్చారు. మరో వైపు సన్నీ లియోన్ అభిమానులు, ముఖ్యంగా ఆ పార్టీకి వెళ్లాలి అనుకున్న వారు తీవ్రంగా నిరుత్సాహం వ్యక్తం చేస్తున్నారు. సన్నీ లియోన్‌ను ఇతర బాలీవుడ్, కోలీవుడ్ స్టార్స్ మాదిరిగా ఎందుకు చూడరు అంటూ వారు ప్రశ్నిస్తున్నారు.

# 'ధురంధర్' వెయ్యి కోట్ల వెనుక.. దిమ్మతిరిగే నిజం!



భారతీయ చలనచిత్ర చరిత్రలో 1000 కోట్ల క్లబ్ అనేది ఒక బెంచ్ మార్క్. సాధారణంగా ఈ రికార్డ్‌ని అందుకోవాలంటే సినిమా పాన్ ఇండియా స్థాయిలో రిలీజ్ కావాలి. ముఖ్యంగా బాహుబలి, ఆర్‌ఆర్‌ఆర్, కేజీఎఫ్, కల్కిలాంటి సినిమాలు దక్షిణాది భాషల్లో రిలీజ్ అయ్యి, అక్కడి నుంచే భారీ వసూళ్లు రాబట్టాయి. కానీ రణ్‌వీర్ సింగ్ 'ధురంధర్' మాత్రం ఆ రూల్‌ని బ్రేక్ చేసి సరికొత్త చరిత్ర సృష్టించింది. ఎలాంటి డబ్బింగ్ లేకుండా, సౌత్ భాషల్లో రిలీజ్ కాకుండానే ఈ మ్యాజికల్ ఫిగర్‌ని టచ్ చేసి అందరినీ ఆశ్చర్యపరిచింది. ఈ రికార్డు వెనుక ఉన్న అసలు విశేషం ఏంటంటే.. ఈ సినిమాను సౌత్‌లో తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం భాషల్లో డబ్బింగ్ చేయలేదు. కేవలం హిందీ వెర్షన్ మాత్రమే దేశవ్యాప్తంగా రిలీజ్ చేశారు. అయినా సరే మన సౌత్ ఆడియెన్స్ భాషతో సంబంధం లేకుండా కంటెంట్‌ని నమ్మి థియేటర్లకు వెళ్లారు. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం కేవలం సౌత్ ఇండియా నుంచే ఈ సినిమాకు దాదాపు 200 కోట్ల వరకు గ్రాస్ వచ్చిందట. ఒక స్ట్రెయిట్ హిందీ సినిమాకు సౌత్‌లో ఈ రేంజ్ ఆదరణ దక్కడం చాలా అరుదు. ఇక లాభాల పరంగా చూస్తే 'ధురంధర్' ఇండియన్ సినిమాలోనే 'మోస్ట్ ప్రాఫిటబుల్ ఫిల్మ్' గా నిలిచే అవకాశం ఉందని అంటున్నారు. వేరే భాషల్లో డబ్బింగ్ ఖర్చులు, అక్కడ డిస్ట్రిబ్యూషన్ కమిషన్లు, భారీ ప్రమోషన్స్ హడావిడి లేకుండా సొంత రిలీజ్ ద్వారానే ఇంత మొత్తం రాబట్టడం విశేషం. దీనివల్ల నిర్మాతలకు మిగిలే లాభం మిగతా వెయ్యి కోట్ల సినిమాల కంటే చాలా ఎక్కువగా ఉంటుందని ఇండస్ట్రీలో చర్చ జరుగుతోంది. ఆదిత్య ధర్ టేకింగ్, స్పై యాక్షన్ థ్రిల్లర్ జానర్ కావడం సినిమాకు బాగా ప్లస్ అయ్యింది. కంటెంట్ బలంగా ఉంటే భాష అడ్డుకాదని ఈ సినిమా మరోసారి నిరూపించింది. సబ్ టైటిల్స్ సాయంతోనే మన ఆడియెన్స్ సినిమాను ఎంజాయ్ చేశారు అంటే కథలో ఎంత గ్రిప్పింగ్ ఎలిమెంట్స్ ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. 'ఏ' సర్టిఫికెట్ సినిమా కావడం, ఎలాంటి కమర్షియల్ హంగులు లేకపోయినా ఈ రేంజ్ సక్సెస్ సాధించడం నిజంగా గ్రేట్. మొదటి భాగం కేవలం హిందీ వెర్షన్ తోనే బాక్సాఫీస్‌ని షేక్ చేసిందంటే, ఇక రాబోయే సీక్వెల్ పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. పార్ట్ 1 సక్సెస్‌తో పార్ట్ 2 పై అంచనాలు మరో రేంజ్ కి వెళ్లాయి. ఒకవేళ రెండో భాగాన్ని కనుక అన్ని భాషల్లో డబ్బింగ్ చేసి రిలీజ్ చేస్తే, కలెక్షన్స్ ఏ రేంజ్‌లో ఉంటాయో అంచనా వేయడం కష్టమే. పార్ట్-2 ని ఎవరు ఆపలేరు అనే టాక్ ఇప్పుడు ఇండస్ట్రీలో బలంగా వినిపిస్తోంది.

ఇక 'ధురంధర్' విజయం ఇండియన్ ఫిల్మ్ మేకర్స్ కు ఒక కొత్త కాన్ఫిడెన్స్ ఇచ్చింది. పాన్ ఇండియా రిలీజ్ అనే ట్యాగ్ లేకపోయినా, కంటెంట్ లో దమ్ముంటే బాక్సాఫీస్ రికార్డులు బద్దలు కొట్టొచ్చని గట్టిగా చెప్పింది. 2025 బాక్సాఫీస్ విన్నర్‌గా నిలిచిన ఈ సినిమా రికార్డులు ఇప్పట్లో ఎవరూ బ్రేక్ చేయలేకపోవచ్చు.

# వారంలో చూసే లాభం ఒక్క పూటలో ఇచ్చేసిన బన్నీ!



సెలబ్రిటీ లైఫ్ స్టైల్ ఎలా ఉంటుందన్నది చెప్పాల్సిన పనిలేదు. వాళ్ల స్థాయిని బట్టి లైఫ్ స్టైల్‌ని డిజైన్ చేసుకుని వెళ్తుంటారు. అందుకోసం లక్షలు ఖర్చు అవ్వొచ్చు..కోట్లు ఖర్చు అవ్వొచ్చు. కానీ బన్నీ స్టార్ హోటల్ లోనూ భోజనం చేయగలడు. కాకా హోటల్‌లో సైతం లంచ్ చేసేంత సింపుల్ సిటీ అతడి సొంతం. పుష్ప షూటింగ్ సమయంలో ఓ రోడ్డు పక్కన చిన్న హోటల్‌లో బన్నీ బ్రేక్ ఫాస్ట్ చేయడం అప్పట్లో ఓ సంచలనంగా మారింది. ఆ తర్వాత విక్టరీ వెంకటేష్ కూడా సాధారణ హోటల్‌కి వెళ్లి వాళ్లతో కలిసి భోజనం చేయడం అంతే వైరల్ అయింది. వీరిద్దరి సిద్ధాంతం ఒక్కటే. జీవింతం ఎంత సింపుల్‌గా ఉంటే జీవితాంతం అంత సంతోషంగా ఉండగలమని నమ్మే తారుల. తాజాగా బన్నీ ఒక్క పూటలోనే లక్షల రూపాయలు ఖర్చు చేసాడు? వారమంతా కష్టపడితే గాని చూడని డబ్బును ఒక్క పూటలోనే ఓ రెస్టారెంట్‌కి చెల్లించి షాక్ ఇచ్చాడు బన్నీ. ఆ వివరాల్లోకి వెళ్తే. బన్నీ ఇటీవల బెల్జియం పర్యటించిన సంగతి తెలిసిందే. తన స్నేహితులతో కలిసి పుట్టిన రోజు పార్టీని ఘనంగా చేసుకోవాలనుకున్నాడు. దీనిలో భాగంగా బెల్జియంలోనే అత్యంత విలాసవంతమైన సేవలు అందించే ప్రముఖ లగ్జరీ కాన్సియర్జ్ రెస్టారెంట్ ముందు ల్యాండ్ అయ్యారు. వారు వెళ్లే సమయానికి రెస్టారెంట్ మూత పడి ఉంది. కానీ బన్నీ స్నేహితులు అదే రెస్టారెంట్‌లో భోజనం చేయాలని పట్టుబట్టడంతో రెస్టారెంట్ యాజమాన్యంతో మాట్లాడి ఓపెన్ చేయించారు. కేవలం బన్నీ కోసమే ఓపెన్ చేసి ఒక్క పూట సేవలందించారు. అందుకోసం ఆ రెస్టారెంట్ ఒక వారాంతం మొత్తంలో సంపాదించే ఆదాయాన్ని (లక్షల్లో) చెల్లించారు. వారికి ఇష్టమైన భారతీయ వంటకాల్ని, వారి అభిరుచికి తగ్గ సంగీతాన్ని ఏర్పాటు చేశారు. ఆ సాయంత్రం వారి కోరిన సకల వంటకాలు అందించి ఫిదా చేసారు. గతంలో ఇదే రెస్టారెంట్‌లో ఎంతో మంది హాలీవుడ్ స్టార్లు, బాలీవుడ్ స్టార్లకు సేవలందించామని యాజమాన్యం తెలిపింది. కానీ బన్నీతో ఆ సాయంత్రం మాత్రం అత్యంత అరుదైన అనుభవంగా చెప్పుకొచ్చారు. బన్నీ నిజంగా గ్రేట్. స్నేహితు లని ఎంత మాత్రం నిరుత్సాహపరచకూడదు అన్న కారణంతో ఆ పూట కోసమే లక్షలు ఖర్చు చేసి వారికి కావాల్సిన ఏర్పాటు చేయించాడు. అదీ ఓ విదేశంలో. హైదరాబాద్ సహా దేశంలో ఎక్కడైనా బన్నీకి ఇలాంటి సేవలు చాలా సులభంగా అందుబాటులో ఉంటాయి. కానీ విదేశంలో కూడా పుష్ప రాజ్ తగ్గేదేలే అని నిరూపించాడు.

# వి ఎస్ యూలో ఉత్సాహంగా 'ఇంట్రామ్యూరల్ టోర్నమెంట్' ప్రారంభం






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ ప్రాంగణంలో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించిన 'విక్రమ సింహపురి యూనివర్సిటీ కాలేజీ నెల్లూరు ఇంట్రామ్యూరల్ టోర్నమెంట్' సోమవారం ఘనంగా ప్రారంభమైంది. విశ్వవిద్యాలయ ఉపకులపతి (వైస్ ఛాన్సలర్) ఆచార్య అల్లం శ్రీనివాస రావు ముఖ్య అతిథిగా విచ్చేసి క్రీడా పతాకాన్ని ఆవిష్కరించి పోటీలను అధికారికంగా ప్రారంభించారు.

**క్రీడలు వ్యక్తిత్వ వికాసానికి పునాది : వీసీ**

ఈ సందరరేగా ఏర్పాటు చేసిన సభలో ఉపకులపతి మాట్లాడుతూ.. క్రీడలు కేవలం శారీరక దృఢత్వానికే కాకుండా, విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. చదువుతో పాటు క్రీడల్లో చురుగ్గా పాల్గొన్నప్పుడే పరిపూర్ణ వ్యక్తిత్వం అలవడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. "అంతర్జాతీయ క్రీడాకారిణి కరణం మల్లేశ్వరిని విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలి. క్రీడా ప్రతిభే ఆమెను వైస్ ఛాన్సలర్ స్థాయికి చేర్చింది. క్రీడలు జీవితాన్ని ఉన్నత స్థితికి ఎలా తీసుకెళ్తాయో చెప్పడానికి ఆమె ఒక గొప్ప నిదర్శనం." ఆచార్య అల్లం శ్రీనివాసరావు, వీసీ, వీఎస్‌యూ

**ఉత్సాహభరితంగా మార్చ్‌ఫాస్ట్**

టోర్నమెంట్ ప్రారంభంలో వివిధ విభాగాల విద్యార్థులు క్రమశిక్షణతో నిర్వహించిన కవాతు (మార్చ్‌ఫాస్ట్) ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ పోటీల్లో యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల విద్యార్థులు జట్లుగా విడిపోయి ఈ క్రింది విభాగాల్లో తలపడనున్నారు: క్రికెట్, వాలీబాల్, బాస్కెట్‌బాల్.

**ప్రతిభను వెలికి తీసే వేదిక:**

యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ డాక్టర్ సి. హెచ్. వెంకట్రాయిలు మాట్లాడుతూ.. విద్యార్థుల ప్రతిభను గుర్తించడానికి ఇంట్రామ్యూరల్ పోటీలు ఒక వేదికగా నిలుస్తాయన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తయారు చేయడమే లక్ష్యంగా వర్సిటీలో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.



# మైనారిటీ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాను


**- కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగ్ రావు - కోరుట్ల మైనారిటీ వర్కింగ్ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం**

**కోరుట్ల, (రాజధాని వార్తలు):** జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలో కోరుట్ల మైనారిటీ వర్కింగ్ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం ఆదివారం రాత్రి కింగ్స్ గార్డెన్‌లో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కోరుట్ల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగ్ రావు ప్రసంగిస్తూ కోరుట్ల మైనారిటీ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని, నాటి కాలంలో జర్నలిస్టులకు చాలా గౌరవం ఉండేది కానీ ఈ మధ్యకాలంలో జర్నలిస్టులకు నైతిక విలువలు లేకుండా అంతరించిపోతుందని సమాజంలో జర్నలిస్టులకు గొప్ప గౌరవం విలువ ఉంటుందని, జర్నలిస్టులకు ప్రజలు ఇచ్చే గౌరవ మర్యాద, ప్రధాన్యతను కాపాడుకుంటూ నిష్పాక్షికంగా తమ వృత్తిని జర్నలిస్టులు విలువలతో కూడిన జర్నలిజం చేపట్టాలని, అర్హులైన జర్నలిస్టులకు ఇండ్లు వచ్చేలా కృషి చేస్తానని అలాగే జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డ్, హెల్త్ కార్డు ఉపయోగపడేలా ప్రభుత్వానికి నివేదిక తెలుపుతానని, వారికి లబ్ధి పొందేలా చర్యలు తీసుకుంటానని, జర్నలిస్టులకు ఏ సమస్య ఉన్న తన దృష్టికి తీసుకువస్తే వెంటనే ఆ సమస్యపై తగిన చర్యలు తీసుకుంటానని, రాష్ట్ర ప్రభుత్వం నుండి తమ వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని హామీ



ఇచ్చారు. జర్నలిస్టులు విలువలతో కూడిన జర్నలిజం చేయాలని అన్నారు. నూతనంగా ఏర్పడిన కార్యవర్గానికి శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ముఖ్య అతిథులుగా విచ్చేసిన ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ముక్కెర చంద్రశేఖర్, తెలంగాణ స్టేట్ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు టైగర్ అలీ నవాబ్, కోరుట్ల ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి ఆకుల మల్లికార్జున్ మాట్లాడుతూ మైనారిటీ వర్కింగ్ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రతి ఒక్కరు విభేదాలు లేకుండా అందర్నీ కలుపుకొని కలిసికట్టుగా తమ బాధ్యతలను నిర్వహించాలని, జర్నలిస్టులు నైతిక విలువలతో కూడిన జర్నలిజం చేపట్టి సమాజంలో ప్రజలకు, ప్రభుత్వానికి, అధికారులకు వారధిగా నిలవాలని జర్నలిస్టులందరికీ ఎల్లప్పుడు కోరుట్ల ప్రెస్ క్లబ్ తోడు ఉంటుందని అన్నారు. నూతనంగా ఏర్పడ్డ కార్యవర్గ అధ్యక్షులు మహమ్మద్ చాంద్ పాషా మాట్లాడుతూ కోరుట్ల మైనారిటీ వర్కింగ్ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు నాపై నమ్మకంతో ఇచ్చిన బాధ్యతని నిశ్వథకంగా, సక్రమంగా నిర్వహిస్తానని అసోసియేషన్ అభివృద్ధికై కృషి చేస్తానని, కార్యవర్గ సభ్యులందరూ ఎల్లప్పుడు ఇలాగే సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువాడి నర్సింగ్ రావు, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ముఖ్యర చంద్రశేఖర్, తెలంగాణ స్టేట్ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు టైగర్ అలీ నవాబ్, కోరుట్ల ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి ఆకుల మల్లికార్జున్, అన్నం అనీల్ కాంగ్రెస్ నాయకులు, కోరుట్ల సీనియర్ డాక్టర్ వై అనుప్ రావు, తిరుమల గంగాధర్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు, ఎం ఏ రఫీ ఎంఐఎం పట్టణ అధ్యక్షులు, ఎం ఏ వసీం జిల్లా ఉపాధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్, సయ్యద్ ఫహీమ్ బి ఆర్ ఎస్ మైనార్టీ ప్రెసిడెంట్, సుత్తారి రాములు ఏఐటియుసి నాయకులు, కార్యదర్శి ఎంఐఎం పార్టీ, సొగరాభి కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు, ముజఫర్ అహ్మద్ మాజీ కౌన్సిలర్, మహమ్మద్ సాబీర్ అలీ మాజీ కౌన్సిలర్, అబ్దుల్ రహీం సర్పంచ్ చిన్న మెట్పల్లి, అబ్దుల్ ఖాలీఖ్ వర్కింగ్ ప్రెసిడెంట్ వక్ఫ్ ప్రొటెక్షన్ కమిటీ కోరుట్ల, మహమ్మద్ నజీబుద్దిన్ కాంగ్రెస్ నాయకులు, మొహమ్మద్ ముజీబుద్దిన్ నసీర్ అధ్యక్షులు ఎంపీజే, మహమ్మద్ వకీల్ జిల్లా అధ్యక్షులు హ్యూమన్ రైట్స్ కమిటీ నిర్మల్, మహమ్మద్ మోసిన్ బి ఆర్ ఎస్ నాయకులు, మరియు వివిధ పార్టీల నాయకులకు, కోరుట్ల ప్రెస్ క్లబ్ పాత్రికేయులకు, కార్యవర్గ సభ్యులకు, కోరుట్ల పట్టణ ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మహమ్మద్ సలీం, మహమ్మద్ ఇలియాస్ అహ్మద్ ఖాన్ ముఖ్య సలహాదారులు, తెలంగాణ స్టేట్ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ వ్యవస్థాపకళా అధ్యక్షులు టైగర్ అలీ నవాబ్, అధ్యక్షులు, సుప్రీం కోర్ట్ అడ్వకేట్ సయ్యద్ అనాస్ లీగల్ అడ్వైజర్, హమ్మద్ అహ్మద్ ఉపాధ్యక్షులు, హమ్మద్ అలీ కార్యదర్శి, మహమ్మద్ యూసుఫ్ సహాయ కార్యదర్శి, నజీబ్ ఉల్లా కోశాధికారి, షేక్ రహీమ్,, మహమ్మద్ సాజిద్, అబ్దుల్ బారి, మహమ్మద్ సాదిక్, మహమ్మద్ ఖీజర్, మహమ్మద్ సాదిక్, మహమ్మద్ ఖీజర్, మహమ్మద్ ఆరిఫ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

# వెంకటేశ్వర స్వామికి కల్కి అవతార అలంకరణ



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ 85వ వార్షిక దశావతార మహోత్సవాలు వెంకటేశ్వర స్వామి కల్కి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి కే జగదీశ్వరరావు, ఆలయ చైర్మన్ జల్లూరి వీర్రాజుల ఆధ్వర్యంలో 10వ రోజు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామిని కల్కి అవతారంలో ప్రత్యేక రీతిన అలంకరించి విశేష పూజలు చేపట్టారు. అలాగే రాత్రి ఆలయంలో స్వామి వారికి పల్లకి సేవ పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్బంగా ఆలయ అధికారి మాట్లాడుతూ స్వామివారి దశావ తార పర్వదినాల్లో భాగంగా స్వామివారిని గత పది రోజులుగా 10 అవతారాల్లో అలంకరించి విశేష పూజలు నిర్వహించిన్నట్టు చెప్పారు. కాగా 30వ తేదీ ఆలయంలో ముక్కోటి ఏకాదశి సందర్బంగా ప్రత్యేక పూజలు నిర్వహించనుండగా ఉదయం తాళాభత్తుల సావిత్రిచే కర్ణాటక సంగీతం నిర్వహి స్తున్నట్టు ఆలయ అధికారి జగదీశ్వర రావు చెప్పారు. ఈ ముక్కోటి ఏకాదశి పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని ఆయన తెలిపారు. కాగా ఈ ప్రత్యేక రీతిలో పూజల్లో భాగంగా రాత్రి ఆలయంలో ప్రత్యేక భజన, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కాగా ఉదయం నుంచి రాత్రి వరకు కల్కి అవతారంలో ఉన్న వెంకటేశ్వర స్వామిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని ఊయల సేవలో పాల్గొన్నారు. భక్తులకు ఆలయ అధికారులు ప్రత్యేక ప్రసాదాలను అందజేశారు.

# మంత్రి సుభాష్ చొరవతో కోటిపల్లి రేవు పునః ప్రారంభం

**- రేవును ప్రారంభించిన మంత్రి తండ్రి వాసంశెట్టి సత్యం**

**అమలాపురం, (రాజధాని వార్తలు):** ఎట్టకేలకు కోటిపల్లి–ముక్తేశ్వరం రేవు తిరిగి పునః ప్రారంభమైంది. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా నుండి కోటిపల్లి, ద్రాక్షరామం, కాకినాడ వెళ్లేందుకు దగ్గర మార్గం కోటిపల్లి–ముక్తేశ్వరం రేవు కావడంతో అంబేద్కర్ కోనసీమ జిల్లా వాసులతో పాటు కాకినాడ జిల్లా వాసులకు ఇది సులువైన మార్గంగా ఉంది. గోదావరి వరద ఉధృతి, ఇతర సాంకేతిక కారణాల వల్ల కోటిపల్లి రేవులో రాకపోకలు నిలిచిపోయిన సంగతి తెలిసిందే. ఈ విష యమై రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ చొరవ తీసుకొని సంబంధిత అధికారులతో చర్చించి రేవు పునః ప్రారంభం అయ్యేలా చర్యలు చేపట్టారు. దీంతో కోటిపల్లి రేవు వద్ద సోమవారం పూజలు నిర్వహించి మంత్రి సుభాష్ తండ్రి, కూటమి సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం దాటింపు పంటును ప్రారంభించారు. రేవు పునఃప్రారంభం కావడంతో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంకు వచ్చేవారికి, కోటిపల్లి ద్రాక్షారామం కాకినాడ తదితర ప్రాంతాలకు వెళ్లే వారు తక్కువ సమయంలో చేరుకునే అవకాశం ఏర్పడింది. రేవు పునఃప్రారంభం కావడంతో ఇరు ప్రాంతాల ప్రజలు ఆనందం వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో రేవు నిర్వాహకులు రేవు శ్రీను, కర్రి చిట్టిబాబు, కంచుమర్తి బాబురావు, పెమ్మాడి సత్తిబాబు, రవ్వా భూషణం, వెంకటేష్, తడాల లోవరాజు తదితరులు పాల్గొన్నారు.



# మురికివాడ ప్రాంతంలో ఇళ్ల నిర్మాణానికి కృషి చేస్తా

**- వెలంపేటలో పర్యటించిన మున్సిపల్ శాఖ మంత్రి డాక్టర్ పి.నారాయణ**

**- మంత్రికి సమస్యలు వివరించిన మేయర్, ఎమ్మెల్యే, కమిషనర్**




**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలోనే అత్యధికంగా మురికివాడ ప్రాంతాలు కలిగి ఉన్న విశాఖ నగరం లో నిర్వాసితులకు తక్షణమే ఇళ్ల నిర్మాణాలు చేపట్టే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారని దీనికి సంబంధించి ప్రత్యేక యాక్షన్ ప్లాన్స్ సిద్ధం చేస్తున్నట్లు రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి డాక్టర్ పి.నారాయణ తెలిపారు. విశాఖ పర్యటనలో భాగంగా సోమవారం దక్షిణ నియోజకవర్గంలోని వెలంపేట లక్ష్మీ నగర్ మురికివాడ ప్రాంతంలో నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరాజు,దక్షిణఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, కమిషనర్ కేతన్ గార్గ్, వి ఎం ఆర్ డి ఎ కమిషనర్ ఎన్.తేజ్ భరత్, స్థానిక కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, ఇతర అధికారులతో తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజల నుంచి వారి సమస్యలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలోనే మేయర్, ఎమ్మెల్యే, డిప్యూటీ మేయర్, జీవీఎంసీ కమిషనర్ మంత్రికి ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన అంశాలపై వివరించారు. 50 ఏళ్లుగా ఇదే ప్రాంతంలో కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నామని తమకు తక్షణమే ఇళ్ల నిర్మాణాలు మంజూరు చేసే దిశగా చర్యలు చేపట్టాలని స్థానికులు మంత్రిని కోరారు. వర్షాకాలంలో చాలా ఇబ్బందులకు గురవుతున్నామని, 177 కుటుంబాలకు ఇళ్లను నిర్మించి మౌలిక సదుపాయాలను కల్పించాలని మంత్రికి నివాసితులు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగానే మంత్రి నారాయణ ఆయా నిర్వాసితుల ఇళ్లకు వెళ్లి స్వయంగా వారు పడుతున్న ఇబ్బందులను పరిశీలించారు. అయితే ఆరు చదరపు అడుగుల స్థలంలో జీవనం సాగించడం బాధాకరమని వారికి ఇళ్లను నిర్మించే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ వెలంపేట మురికివాడ ప్రాంతాన్ని స్పెషల్ ప్రాజెక్టుగా తీసుకొని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని ఇదే విషయాన్ని, వాస్తవ పరిస్థితులను సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్తామన్నారు. త్వరలోనే సాధ్యమైనంత మేర ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేలా అన్ని చర్యలు తీసుకుంటామని ప్రజా ప్రతినిధులకు, స్థానిక ప్రజలకు మంత్రి నారాయణ హామీ ఇచ్చారు.

ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ చాలాకాలంగా వెలంపేట మురికివాడ ప్రాంత సమస్య అలాగే ఉందని, రాష్ట్ర ప్రభుత్వం ఈ మురికివాడ ప్రాంత అభివృద్ధిపై దృష్టి సాధించడం అభినందనీయమన్నారు. లక్ష్మీ నగర్ లేఔట్‌తో పాటు మరో ఐదు ప్రాజెక్టులు పెండింగ్లో ఉన్నా యని, ఆయా సమస్యలు పరిష్కరిస్తే విశాఖ దక్షిణ నియోజకవర్గం రాష్ట్రంలోని మోడల్ నియోజకవర్గంగా అభివృద్ధి చెందుతుం దన్నారు. ఇప్పటికే ఈ మురికివాడ ప్రాంతాలకు సంబంధించి రోడ్ల నిర్మాణాలు పూర్తి చేశామని, కేవలం గృహాలు సమస్య మాత్రమే పెండింగ్లో ఉందన్నారు. పూర్ణ మార్కెట్ సమస్యను కూడా పూర్తిగా పరిష్కరిస్తే దక్షిణ నియోజకవర్గం రూపురేఖలు పూర్తిస్థాయిలో మారిపోతాయని ఎమ్మెల్యే మంత్రికి వివరించారు. ఈ సందర్భంగానే నగర మేయర్ పీలా శ్రీనివాసరావు దక్షిణ నియోజకవర్గం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లి వాటిని పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ అదనపు కమిషనర్లు డి.వి.రమణమూర్తి, పి.ఎం సత్యవేణి, ప్రధాన ఇంజనీర్ పీ.వీ. సత్యనారాయణ రాజు, జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్య నాయుడు, పర్యవేక్షిక ఇంజనీరు పల్లమ రాజు, రాయల్ బాబు, సహాయక వైద్యాధికారి డాక్టర్ కృష్ణంరాజు, ఏపీడి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా హిందూ సమ్మేళనం




**కాకినాడ, (రాజధాని వార్తలు):** రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ అప్లికేషన్ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా 31 వ వార్డ్ ఆర్ఎస్ఎస్ స్వయం సేవకులు బంగారు లోవరాజు అధ్యక్షతన హిందూ సమ్మేళనం కాకినాడ రాగంపేట లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పూజ శ్రీ దివ్యనంద సరస్వతి స్వామీజీ పాల్గొని హిందువులను ఉద్దేశించి ప్రసంగించారు. హిం దువుల ఎదుర్కొంటున్న సమస్యలపై ఐక్యతగా ఉండాల్సిన అవ సరం ఉందని తెలియచేసారు. ఆంధ్ర శబరిమల స్థాపకులు కుసుమంచి సత్య శ్రీనివాస భూపాతి మాట్లాడుతూ, హైందవ ధర్మం రక్షణ కోసం పోరాడుతున్న ఆర్ఎస్ఎస్ 100 సంవత్సరా లకు పూర్తి చేసుకోవడం అనేది చాలా గొప్ప విషయం అని తెలియచేసారు. బావితరాలకి హిందూ సంస్కృతి అందించాల్సిన బాధ్యాత మన అందరిపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా విచ్చేసిన గోపాలస్వామి మాట్లాడుతూ, ఆర్ఎస్ఎస్ అయోధ్య రామ ఆలయం కోసం ఎన్నో పోరాటాలు చేసి ఈరోజు హిందువుల ఐక్యతతో నిర్మాణం చేసుకున్నామని హిందువుల ఐక్యత చేయడమే ఆర్ఎస్ఎస్ లక్ష్యం అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎనిమిరెడ్డి మాలకొండయ్య, జ్యోతుల రాజేష్, దొడ్డి వీరేంద్ర, చెక్క రమేష్, పైడిమల్ల చరియన్ ,ప్రతాప్, మరే బుజ్జి, కూరపాటి సూరిబాబు బంగారు దుర్గ భవాని, నైనెప్పు శివ, దొడ్డి అప్పలరాజు, నాగులకొండ బద్రి, సుధా, తదితరులు పాల్గొన్నారు.

# అర్జీదారులకు సంతృప్తికరమైన సమాధానం ఇవ్వాలి : జేసీ అపూర్వ భరత్

## - భూ సమస్యల పరిష్కారంపై రెవెన్యూ క్లినిక్ ఏర్పాటు



**కాకినాడ, (రాజధాని వార్తలు):** అర్జీదారుల సంతృప్తికరమైన పరిష్కారాలు ఇచ్చేలా అధికారులు పీజీఆర్ఎస్ అర్జీలను నాణ్యతతో పరిష్కరిం చాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ అధికారులను ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక జిల్లాస్థాయి కార్యక్రమం సోమవారం కాకినాడ కలెక్టరేట్ వివేకానంద గ్రీవెన్స్ హాలులో జరిగింది. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, ట్రైనీ కలెక్టర్ మనీషా, జెడ్పీ సీఈవో లక్ష్మణరావు, సీపీవో పీ త్రినాథ్, జీజీహెచ్ అడ్మినిస్ట్రేషన్ అధికారి ఎన్ శ్రీధర్, డీఎం హెచ్ఓ జె నరసింహా నాయక్, కాకినాడ డివిజన్ అభివృద్ధి అధికారి పి వాసుదేవరావు తదితర అధికారుల కాకినాడ జిల్లా చుట్టుపక్కల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులను, అర్జీలను స్వీకరించారు. ఈ అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచి స్తూ వాటిపై సత్వరం సమగ్రమైన విచారణ చేపట్టి తగిన పరిష్కా రం అందించాలని జాయింట్ కలెక్టర్ అధికారులను ఆదేశిం చారు. బియ్యం కార్డు మంజూరు, కార్డులలోని పేర్లు మార్పులు చేర్పులు, పింఛన్లు, ఉద్యోగ ఉ పాధి అవకాశాలు, ఆక్రమణలు తొలగింపు, డ్రైన్, కాలువల్లో పూడిక తొలగింపు, పారిశుధ్యం వంటి అంశాలపై మొత్తం 400 అర్జీలు అందాయి. ఈ సం దర్భంగా జేసీ అపూర్వ భరత్ మాట్లాడుతూ ప్రజల నుంచి వివిధ సమస్యలపై అందిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలన్నారు. అర్జీదారుల సంతృప్తి స్థాయిని పెంచే దిశగా సంబంధిత శాఖల అధికారులు ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి అర్జీలకు నాణ్యమైన పరిష్కరం చూపాలన్నారు. అర్జీదార్లు తమ యొక్క అర్జీల స్థితిని తెలుసుకోవాడానికి 1100 నెంబరుకి నేరుగా ఫోన్ చేసి తెలుసుకోవచ్చని ఆయన తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కా ర వ్యవస్థ కార్యక్రమానికి హాజరు కాలేని అర్జిదారులు, తమ యొక్క అర్జీలను Meekosam.ap.gov.in వెబ్సైట్ నందు నమోదు చేసుకోవచ్చునని జేసీ అపూర్వ భరత్ తెలిపారు. పెరిగి పోతున్న భూ సమస్యలను పరిష్కరించేందుకు పిజిఆర్ఎస్ జరుగు తున్న భవనంపై అంతస్తులో ప్రత్యేకమైన గ్రీవెన్స్ కార్యక్రమాన్ని రెవెన్యూ క్లినిక్ పేరిట ఏర్పాటు చేశారు. దీనికి అధిక సంఖ్యలో అర్జీదారులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ విభాగాల అధిపతులు తదితరులు పాల్గొన్నారు.

# ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు వేణు ప్రోత్సాహం అభినందనీయం

## - వాసుపల్లి చేతుల మీదుగా రూ.10,000 సాయం



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** ఫుట్బాల్ క్రీడలకు చేయూతనందించిన వైయస్సార్సీపి 30వ వార్డు బీసీ సెల్ అధ్య క్షుడు వేణు ప్రోత్సాహం అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ అభినందించారు. ఈ మేరకు ఆశీర్లమెట్ట కార్యాలయంలో వేణు సమకూర్చిన రూ.10,000 నగదును మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ చేతుల మీదుగా క్రీడాకారులకు అందజేశారు. ఈ సందర్భంగా వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ హరీష్ మెమోరియల్ ఫ్లడ్ లైట్ బీచ్ 5 ఏ సైడ్ ఫుట్బాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్న అరుణ్ కుమార్ బాయ్స్‌కు అభినందనలు తెలియ జేస్తూ క్రీడలు విజయవంతం కావాలని వాసుపల్లి ఆకాంక్షించారు. గంగమ్మ తల్లి ఆలయం వద్ద కోస్టల్ బ్యాటరీ బీచ్ గ్రౌండ్స్‌లో జరగనున్న ఫుట్బాల్ క్రీడలకు 30 వార్డ్ బీసీ సెల్ అధ్యక్షుడు వేణు ప్రోత్సాహం అందించారన్నారు. క్రీడాకారులకు కాన్ఫిడెన్స్‌తో పాటు సెల్ఫ్ డిఫెన్స్, గెలుపు ఓటమిలు తీసుకోవాలన్నారు. క్రీడా కారులకు ఇటువంటి ప్రోత్సాహం అందిస్తే మరిన్ని విజయాలు తీసుకువస్తారని వాసుపల్లి గణేష్ కుమార్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రటరీ గనగళ్ళ రామరాజు జిల్లా బీసీ సెల్ ప్రెసిడెంట్ సనపల రవీంద్ర భరత్, స్టేట్ సంస్కృత విభాగం సెక్రెటరీ సాగర్, చోడపిల్లి శివ, చేపల నూకరాజు టోర్నమెంట్ నిర్వాహకులు, క్రీడాకారులు, 30వ వార్డు దక్షిణ వైసీపీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

# స్త్రీశక్తి పథకం అమలులో మహిళా ప్రయాణీకులకు గుర్తింపు కార్డు నిబంధనలను తొలగించాలని సి.యం.ని కోరిన ఇ.యు నాయకులు



**విజయవాడ, (రాజధాని వార్తలు):** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన స్త్రీశక్తీ పథకం భవిష్యత్‌లో మరింతగా విజయవంతం కావాలంటే మూడు వేలు బస్సులను పెంచి, పది వేల సిబ్బందిని నియమించాలని, అలాగే మహిళా ప్రయాణీకులలో ఇతర రాష్ట్రా లకు చెందిన మహిళా ప్రయాణీకులు పెద్దగా లేనందున ఆదార్ కార్డు,ఇతర గుర్తింపు కార్డులు నిభందనలు తొలగించితే కండక్టర్లపై పనిబారం తగ్గడమే కాకుండా దీనివలన కూటమి ప్రభుత్వానికి మహిళా ప్రయాణీకులలో ఇంకా మంచి పేరు వస్తుందని విజ్ఞప్తి చేస్తూ సోమవారం సచివాలయంలో గౌ. ముఖ్యమంత్రిని కలిసిన సందర్బంగా లేఖ ఇచ్చి విజ్ఞప్తి చేసామని ఏపి పిటిడి (ఆర్టీసి) ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పలిశెట్టి దామోదర రావు, ప్రధాన కార్యదర్శి జి.వి.నరసయ్య, ఉప ప్రధాన కార్యదర్శి యం.డి.ప్రసాధ్ సోమవారం ఒక ప్రకటన తెలియజేసారు. అలాగే ప్రభుత్వ పరిధిలో పెండింగు ఉన్న సమస్యలలో ప్రధానంగా ఉన్న సమస్యలు పరిష్కారించాలని ఉద్యోగులకు పిఆర్సీ,డీఏ బకాయిలు చెల్లించాలని, రిటైర్డు ఉద్యోగులకు చెల్లించాల్సిన గ్రాడ్యూటీ, లీవ్ డబ్బులు చెల్లించాలని తదితర 10 డిమాండ్లతో లేఖ ఇచ్చామని తెలిపారు.

# పచ్చని మొక్కల ప్రదర్శన



**కాకినాడ, (రాజధాని వార్తలు):** స్థానిక గాడ్స్ క్రియేషన్స్ గిఫ్టింగ్ ప్లాంట్స్ ఆధ్వర్యంలో డిసెంబర్ 31 మరియు జనవరి 1 రోజుల పాటు స్థానిక వివేకానంద పార్క్ (కొళాయి చెరువు) గేటు దగ్గర ప్రత్యేక మొక్కల ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని సంస్థ వ్యవ స్థాపకురాలు మైలవరపు సుమన సత్యనారాయణ తెలిపారు. కొత్త సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా పచ్చదనాన్ని వ్యాప్తి చేసి మరియు స్థిరత్వాన్ని ప్రోత్సహించాలన్న లక్ష్యాన్ని అం దరూ కొనసాగించడానికి సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ సంవత్సరం మన అందరం కలిసి కొత్త మార్పుకు శ్రీకారం చూద్దామని ఆమె కోరారు. ఈ సందర్భంగా ఒక మొక్కను బహు మతిగా అందజేసి శుభాకాంక్షలు తెలుపుతూ పర్యావరణాన్ని సంరక్షిద్దామని ఆమె కోరారు. వివేకానంద పార్క్ పక్కన ఉన్న మా మొక్కల స్టాల్ని అందరూ సందర్శించాల్సిందిగా ఆమె ఆహ్వా నించారు. మరింత పచ్చని రేపటిని పెంచడం ద్వారా ప్రోత్సహి ద్దామని మేము చేస్తున్న గ్రీన్ క్యాంపెయిన్‌కు మద్దతు ఇవ్వాల్సిం దిగా ఆమె కోరారు. అందరి సహకారంతో పర్యావరణ పరిరక్షణ ఉద్యమాన్ని కొత్త సంవత్సరంలోనూ కొనసాగిద్దామని దాని ద్వారా సమాజానికి మేలు చేసే విధంగా మన కార్యక్రమాలను రూపొం దించుకుందామని సుమన సత్యనారాయణ ఆహ్వానించారు. 2018 వ సంవత్సరములో ఈ సంస్థను స్థాపించడం జరిగిందని అనాటి నుండి కట్ ఫ్లవర్ బొకేల సంస్కృతికి స్వస్తి పలికి వాటి స్థానంలో సజీవమైన మొక్కలను బహుమతిగా అందించే వినూత్న ఒరవడికి శ్రీకారం చుట్టి ప్రోత్సహించడం జరిగిందని సుమన సత్యనారాయణ గుర్తు చేశారు. తమ సంస్థ ప్రధాన ఆశయం పర్యావరణ పరిరక్షణ, మొక్కల ద్వారా ప్రాణవాయువును పెంచ డం, శాశ్వత జ్ఞాపకం వాడిపోయే పూల కంటే ఎదుగుతూ ఉండే మొక్కల బహుమతి ఇచ్చిన వారి ప్రేమ ఎప్పటికీ గుర్తుండి పోయేలా ఉంటాయని ఆమె విశ్లేషించారు. ఆరోగ్యకరమైన జీవన శైలి ఇండోర్ మరియు అవుట్డోర్ మొక్కల ద్వారా మన ఇంటి వాతావరణన్ని ఆహ్లాదకరంగా మార్చడం వంటి వినూత్న ఆలో చనలను అమలు చేయడమే తమ లక్ష్యమని, ఆరోగ్యకర సమాజ ఆవిర్భావానికి తమ వంతు సేవ చేస్తున్నామని అందరూ ప్రోత్స హించడం ద్వారా కాలుష్య రహిత నగర వాతావరణ కేంద్రంగా కాకినాడను తీర్చిదిద్దేందుకు అవకాశం ఏర్పడుతుందన్న అభిప్రా యాన్ని సుమన సత్యనారాయణ వ్యక్తం చేశారు. ఇతర వివరాలకు 94402 76788 లో సంప్రదించ వచ్చని ఆమె కోరారు.

# వైభవంగా సత్యదేవుని గ్రామ సేవ




**అన్నవరం, (రాజధాని వార్తలు):** కాకినాడ జిల్లా అన్నవరం శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం ఆధ్వర్యంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా 14వ రోజైన సోమవారం దశమి మహా పర్వదినం శ్రీ స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను వివిధ రకాల సుగంధ ద్రవ్యాలను, వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి వెండీ పల్లకిలో ఆశీనులు గావించి కొండపై నుంచి కొండ దిగువన తొలి పావంచాల వద్దకు తోడ్కొని వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ స్వామి అమ్మవార్ల కు నీరాజన మంత్రపుష్పములు సమర్పించి వేదపండితుల మంత్రో చ్చారణ, మంగళ వాయిద్యాలు నడుమ భక్తుల నామస్మరణ మధ్య గ్రామ పుర వీధుల్లో అత్యంత వైభవంగా గ్రామ సేవ నిర్వహిం చారు. గ్రామసేవలో వేదపండితులు, అర్చకులు, భక్తులు, గ్రామస్తులు, డీఈఈ గుర్రాజు, ఏఈ ఈరంకి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యాభివృద్ధికి రోటరీ గోల్డ్ సేవలు : డాక్టర్ గోపీనాథ్



**కాకినాడ, (రాజధాని వార్తలు):** రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ ఆధ్వర్యం లో అధిక ప్రాధాన్యతం కల్పించడం జరుగుతోందని క్లబ్ అధ్యక్షులు డాక్టర్ గోపీనాథ్ అన్నారు. గ్రామీణ ప్రాంతంలో ఉ న్న పాఠశాలకు చేయూత ఇవ్వాలన్న సంకల్పంతో ప్రత్యేక సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కరప గ్రామంలో ఉన్న మహాత్మ జ్యోతిరావు పూలే ఆంధ్రప్రదేశ్ బ్యాక్వర్డ్ రెసిడెన్షియల్ పాఠశాలకు సుమారు 30 వేల రూపాయలు విలువచేసే కంప్యూటర్ మరియు ప్రింటర్లను క్లబ్ అధ్యక్షులు డాక్టర్ గోపీనాథ్ సొంత నిధులతో సమకూర్చగా వాటిని రోటరీ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ ఎస్వీఎస్ రావు చేతుల మీదుగా ఆ పాఠశాల ప్రిన్సిపాల్ కెవి రామకృష్ణా రావుకు రోటరీ క్లబ్‌లో అందజేశారు. ఈ సందర్భంగా రామకృ ష్ణారావు మాట్లాడుతూ తన పాఠశాల అభివృద్ధికి రోటరీ గోల్డెన్ జూబ్లీ సహాయ సహకారాలు అందించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు ప్రభుత్వం విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పి స్తున్నప్పటికీ మరింతగా సదుపాయాలను కల్పించే బాధ్యత తమపై ఉందన్నారు వచ్చే విద్యా సంవత్సరానికి విద్యార్థుల సంఖ్యను సుమారు 350కు పెంచేందుకు కృషి చేస్తున్నట్లు రామకృష్ణ తెలిపారు. రెండు పుట్ల భోజన సదుపాయాల్లో ప్రభుత్వం నిర్దేశిం చిన పోషక విలువలతో కూడిన ఆహారాన్ని విద్యార్థులకు అందజే స్తున్నామని తెలిపారు. ప్రస్తుతం టీవీ పాడైపోయిందని కొత్తది అందజేయాల్సిందిగా రామకృష్ణారావు విజ్ఞప్తి చేశారు. జిల్లా కలెక్టర్ సహకారంతో విద్యార్థులకు వసతి సదుపాయాలను కల్పిస్తున్నా మని ఇటీవల డైనింగ్ హాలు కూడా అందుబాటులోకి వచ్చిం దన్నారు. పి డి జి డాక్టర్ ఎస్ వి ఎస్ రావు మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు నిర్వహణలో డాక్టర్ గోపీనాథ్ తీసుకుంటున్న ప్రత్యేక శ్రద్ధ అభినందనీయమని కొనియాడారు విద్యాభివృద్ధికి ఇప్పటికే హ్యాపీ స్కూల్స్ పేరిట పిఆర్ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అంతేకా కుండా విద్యార్థినులకు అవసరమైన ప్రత్యేక సైకిల్ స్టాండ్ షెడ్ నిర్మాణానికి కూడా డాక్టర్ గోపీనాథ్ ముందుకు రావడం పట్ల ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి డాక్టర్ ప్రవీణ్ సానా కోశాధికారి ఉదయ్ చక్రవర్తి తోపాటు పలువురు పాల్గొన్నారు.

# నూతన వ్యాపార దుకాణాన్ని ప్రారంభించిన ఎంఎల్ఏ



**అన్నవరం, (రాజధాని వార్తలు):** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజక వర్గం శంఖవరం మండలం అన్నవరం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు వీర్ల సూరిబాబు, వారి తమ్ముళ్ళు, శ్రీ చక్రరావు, రాము మరియు కుటుంబ సభ్యులతో నూతన వ్యాపార దుకాణాన్ని గౌరవ శాసన సభ్యురాలు, వరుపుల సత్య ప్రభ రాజా రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు, నూతనంగా వ్యాపారం ప్రారంభించిన సూరిబాబుకి అభినం దనలు తెలిపారు. వ్యాపారంలో మంచి పేరు, లాభాలు గడిం చాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కూటమి సభ్యులు కూడా పాల్గొన్నారు.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call

9440662699, rajadhanivartalu.com

## EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ అఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

## HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యం.ఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

## MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్:1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

## REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

## NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ చి.రమేష్, మంగళగిరి 0863-999999

## RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

## COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎప్లానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి ప్రాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పాట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్సపోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# జివిఎంసి "ప్రజా సమస్యల పరిష్కార వేదిక"లో 100 వినతులు : జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమంలో జీవీఎంసీలో అన్ని విభాగాలకు కలిపి 100 విన తులు వచ్చాయని జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ పేర్కొన్నారు. సోమవారం ఆయన జివిఎంసి ప్రధాన కార్యాలయం పాత సమావేశ మందిరంలో అదనపు కమిషనర్లు డి.వి.రమణమూర్తి, ఎస్ ఎస్ వర్మలతో కలసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న"ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమానికి జివిఎంసికి సంబంధించి 100 అర్జీలు / ఫిర్యాదులు స్వీకరించడం జరిగిందని తెలిపారు. అందులో ముఖ్యంగా భీమిలి జోన్‌కు 06, మధురవాడ జోన్‌కు 16, ఈస్ట్ జోన్‌కు 15, వెస్ట్ జోన్‌కు 07, నార్ట్ జోనుకు 06, సౌత్ జోన్‌కు 12, పెందుర్తి జోన్‌కు 07, అగనంపూడి జోన్‌కు 02, గాజువాక జోన్‌కు 07, అనకాపల్లి జోన్‌కు 01, జివిఎంసి ప్రధాన కార్యాలయానికి 21 ఫిర్యాదులు అందాయని తెలిపారు. అలాగే జివిఎంసి అడ్మినిస్ట్రేషన్ & అకౌంట్సు విభాగమునకు 14, రెవెన్యూ విభాగమునకు 11, ప్రజారోగ్య విభాగమునకు 06, పట్టణ ప్రణాళిక విభాగమునకు 43, ఇంజనీరింగు విభాగమునకు 18, మొక్కల విభాగమునకు 03, యుసిడి విభాగమునకు 05 కలిపి మొత్తంగా 100 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. అనంతరం కమిషనరు మాట్లాడుతూ ఫిర్యాదులకు సంబంధించిన విభాగాధిపతులు ప్రజలు పెట్టుకున్న అర్జీలను/ఫిర్యాదులను అదే రోజు వెంటనే పరిశీలిస్తూ, సంబంధిత ఫిర్యాదు దారులతో సంప్రదించి నిర్ణీత సమయంలో పరిష్కరించాలని, వచ్చిన అర్జీలపై అధికారులు వెంటనే స్పందించి కార్యాచరణ అదేరోజు చేపట్టాలని, ప్రతివారం అదే ఫిర్యాదులు తిరిగి ప్రజలు సమర్పించకుండా ఆయా సమస్యలను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని జివిఎంసి అధికారులను, జోనల్ కమీషనర్లను కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఇంజనీర్ సత్యనారాయణరాజు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇ.ఎన్.వి నరేష్ కుమార్, సిసిపి ఎ.ప్రభాకర రావు, డిసిఆర్ ఎస్.శ్రీనివాసరావు, డిడిహెచ్ ఎమ్.దామోదరరావు, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ సి.వాసుదేవ రెడ్డి, కార్యదర్శి బివి రమణ, స్పోర్ట్స్ డైరెక్టర్ ఇ.ఎ.రాజు, పర్యవేక్షక ఇంజనీర్లు, సిపి, డిసీపీలు, ఏసీపీలు, కార్యనిర్వాహక ఇంజినీర్లు, బయాలజిస్ట్, తదితరులు పాల్గొన్నారు.

# అంతర్రాష్ట్ర కబడ్డీలో జిల్లా జట్టుకు ఛాంపియన్ షిప్



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** కర్నూలు జిల్లా పంచలింగాల్లో జరిగిన 72వ పురు షుల అంతరాష్ట్ర కబడ్డీ ఛాంపియన్షిప్ పోటీల్లో కాకినాడ జిల్లా జట్టు మొదటి స్థానం సాధించారు. ఈ మేరకు జిల్లా కబాడీ అసోసియేషన్ కార్యదర్శి కొండపల్లి శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలుపుతూ ఎంతో ఉత్కంఠ భరితంగా జరిగిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో జిల్లా జట్టు అత్యంత ప్రతిభను కనబరిచి ఛాంపియన్ షిప్‌ను సాధించినట్లు తెలిపారు. రాష్ట్ర మొత్తం మీద 26 జిల్లాలకు చెందిన టీములు ఈ పోటీల్లో పాల్గొన్నట్టు చెప్పారు. అయితే 26 జిల్లాల్లో నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులను ఎంపిక చేసి ఫిబ్రవరి నెలలో గుజరాత్ రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు రాష్ట్ర అసోసియేషన్ నుంచి పంపించనున్నట్టు ఆయన తెలిపారు. కాగా అంతర్ జిల్లాల ఛాంపియన్ షిప్‌లో ప్రధమ స్థానం సాధించిన జిల్లా జట్టుకు అసోసియేషన్ సభ్యులు, ఇంటర్నేషనల్ కోచ్ సాయిప్రసాద్, ఇంటర్నేషనల్ రిఫరీ బోగిళ్ల మురళీ కుమార్, నిమ్మకాయల కిరణ్ కుమార్, ఇంటర్నేషనల్ ప్లేయర్స్ శ్వేత, కే శ్రీనివాస్ (గిబ్స్), జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు వివి శ్రీనివాస్, తాళ్లూరి వైకుంఠం, తదితరులు అభినందనలు తెలిపారు.

# ధర్మకర్తలుగా ఎన్నికైన బలిజ మహిళలకు ఘన సన్మానం



**గూడూరు, (రాజధాని వార్తలు):** గూడూరు పట్టణంలోని పలు దేవాలయాలకు ధర్మకర్తల మండలి సభ్యులుగా ఎన్నికైన బలిజ మహిళలకు బలిజ సంక్షేమ సంఘం కార్యాలయ ఆవరణంలో సంఘం ఆధ్వర్యంలో ఘనంగా అభినందించి సత్కరించారు. బలిజ మహిళా సంక్షేమ సంఘం అధ్యక్షురాలు రాగుతు పద్మావతి మాట్లాడుతూ బలిజ సంఘంకు చెందిన మహిళలు పట్టణంలోని ప్రముఖ దేవాలయాల్లో ధర్మకర్తలుగా ఇంకా ఇతర ప్రఖ్యాతిగాంచిన పదవుల్లో నియమింపబడడం అభినందనీయమని అన్నారు. బలిజ మహిళా సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి ఇసుక సువర్ణ లక్ష్మి మాట్లాడుతూ సంస్థ స్థాపించిన తర్వాత బలిజ కులస్తులకు విద్య వైద్య సమస్యలు పరిష్కరిస్తూ తాము వంతుగా అనేక కార్యక్రమాల నిర్వహిస్తున్నామని తెలిపారు. బలిజ మహిళా సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షురాలు సారంగం సులక్ష్మి మాట్లాడుతూ బలిజ మహిళలు దేవస్థానంలో ధర్మకర్త మండలిలో ధర్మకర్తలుగా నియమింపబడటం సంతోషకరమని భవిష్యత్తులో బలిజ మహిళలు దేవస్థాన ధర్మకర్త మండలి అధ్యక్షురాలుగా ఎదగాలని కోరుకుంటున్నానని తెలియజేశారు.

# పలు కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎంపీ అనురాధ




**అమలాపురం, (రాజధాని వార్తలు):** కుటుంబ సభ్యులు మృతి చెందటంతో ఆ కుటుంబ సభ్యులను అమలాపురం మాజీ ఎంపీ చింతా అనురాధ సోమవారం పరామర్శించి ప్రగాఢ సాను భూతిని తెలిపారు. అల్లవరం మండలం దేవగుప్తం గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయ కులు బొంతు సత్యనారాయణ తండ్రి వెంకటరెడ్డి మృతి చెందగా వెంకటరెడ్డి భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అలాగే అల్లవరం మామిడితోటకు చెందిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త సాకా బాలకృష్ణ మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

తుమ్మలపల్లికి చెందిన కుంచె బాలకృష్ణ మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి కొనుకు గౌతమి, ఎంపీపీ ఇళ్ల శేషారావు, కొనుకు బాపూజీ, సర్పంచ్ బర్రె సీతారత్నం, సాధనాల శ్రీను, పెనువల విక్రం, కూడిపూడి సూర్య ప్రకాష్, చుట్టూరి శ్రీను, గోసంగి వెంకటేశ్వరరావు, పెప్పర్తి వెంకటపతి రాజు యడ్ల వెంకటరమణ, కుంచె నరేంద్ర, బల్ల శ్యామ్, చెల్లి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan